RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 256 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 11-4-2026 | Pages: 8 | R2/-

సంపుటి : 17 | సంచిక : 256 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 11-4-2026 | పేజీలు : 8 | రూ2/-



## నేడు ఏపీ క్యాబినెట్ సమావేశంలో

# తీసుకున్న కీలక నిర్ణయాలు

విశాఖపై ప్రత్యేక దృష్టి..

ఐటీ, డేటా సెంటర్ల హబ్

ఎలక్ట్రానిక్స్, లిథియం

బ్యాటరీల తయారీకి ఊతం

సెమీకండక్టర్లు, పునరుత్పాదక

ఇంధన ప్రాజెక్టులు

స్టీల్, భారీ పరిశ్రమలకు ప్రోత్సాహం

దేశంలోనే తొలిసారి..

అమరావతిలో క్వాంటం వ్యాలీ

పర్యాటకం, ఇరిగేషన్,

ఇతర కీలక ఆమోదాలు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం భారీ అడుగులు వేసింది. శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. సుమారు రూ.39,436 కోట్ల విలువైన పారిశ్రామిక పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. నేటి క్యాబినెట్ సమావేశం అనంతరం సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు.

**విశాఖపై ప్రత్యేక దృష్టి.. ఐటీ, డేటా సెంటర్ల హబ్**

రాష్ట్ర క్యాబినెట్ విశాఖపట్నంను ఐటీ, డేటా సెంటర్ల హబ్‌గా మార్చేందుకు పలు కీలక ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో అదానీ ఇన్‌ఫ్రా, రైడెన్ ఇన్ఫోటెక్ (గూగుల్ అనుబంధ సంస్థ) ఏర్పాటు చేయనున్న ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టుకు సంబంధించి భూమిని 'సేల్ అగ్రిమెంట్' బదులుగా 'సేల్ డీడ్' కింద రిజిస్టర్ చేసేందుకు ఆమోదం తెలిపింది. అలాగే, విశాఖలో ఐటీ పార్క్ ఏర్పాటుకు క్రెడెన్స్ రియాలిటీ సంస్థకు అనుమతినిచ్చింది. దీని ద్వారా రూ.386.88 కోట్ల పెట్టుబడి, 6,500 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఫ్యూజీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌కు 2 ఎకరాల భూమి కేటాయింపుతో రూ.425 కోట్ల పెట్టుబడి, 2,500 ఉద్యోగాలకు సిటెక్ డేటా లిమిటెడ్‌కు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కోసం 40 సెంట్ల భూమి కేటాయింపుతో రూ.1,800 కోట్ల పెట్టుబడికి క్యాబినెట్ ఆమోదం

తరువాయి 2లో..

రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులు..

# సుప్రీం కోర్టులో పిటిషన్



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులను స్వదేశానికి సురక్షితంగా తీసుకొచ్చేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిని పరిశీలించిన న్యాయస్థానం విచారణకు అంగీకరించింది. ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వారిని మభ్యపెట్టి రష్యాకు పంపించిన కొందరు ఏజెంట్లు.. తప్పుదోవ పట్టించారనే

తరువాయి 2లో..

## మహిళలకు రూ.3వేలు, ఆరు నెలల్లో యూసీసీ అమలు

### బెంగాల్‌లో భాజపా మ్యానిఫెస్టో

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భాజపా తన మ్యానిఫెస్టోను విడుదల చేసింది. 'సంకల్ప్ పత్ర' పేరుతో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శుక్రవారం దీన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై అమిత్‌షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ ప్రభుత్వ 15 ఏళ్ల పాలన పశ్చిమబెంగాల్‌కు ఒక పీడకల అని అభివర్ణించారు. రాష్ట్ర

తరువాయి 2లో..






### హైదరాబాద్-అమరావతి-మచిలీపట్నం

### గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి పలు ఆప్షన్లు

### మూడింటిని పరిశీలిస్తున్న ప్రభుత్వం

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

హైదరాబాద్ నుంచి ఏపీ రాజధాని అమరావతి మీదుగా మచిలీపట్నం పోర్టుకు కనెక్టివిటీ ఉండేలా నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే.. ఎటువైపు నుంచి వెళ్లాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం వివిధ ఆప్షన్లను పరిశీలిస్తోంది. రాజధాని ప్రాంతాన్ని ఆనుకొని వెళ్లాలా? అమరావతి అవుటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) మీదుగా మళ్లించాలా? కొంతదూరం ఓఆర్ఆర్ మీదుగా వెళ్లి, కొంత రాజధాని ప్రాంతం నుంచి వెళ్లేలా చూడాలా? ఇలా అనేక ఆప్షన్లతో కూడిన అలైన్‌మెంట్లపై అధ్యయనం చేస్తున్నారు. ఈ ఎక్స్‌ప్రెస్ వే కోసం నియమించిన సలహా సంస్థ కొన్ని అలైన్‌మెంట్లను ప్రతిపాదించింది. వీటిలో ఏది మేలు? దూరం ఎంత? ప్రయాణ సమయం ఎంత తగ్గుతుంది? నిర్మాణ వ్యయమెంత అవుతుంది? ఎంత మేరకు భూసేకరణ చేయాల్సి ఉంటుంది? అనేవి కూడా పరిగణనలోకి తీసుకొని ఆప్షన్లను పరిశీలిస్తున్నారు. ప్రధానంగా మూడు ఆప్షన్లపై ప్రభుత్వం మొగ్గుచూపిస్తున్నట్లు తెలిసింది. అవి..

**మొదటి ఆప్షన్..**

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో రేడియల్ రోడ్ నుంచి ఎక్స్‌ప్రెస్ వే మొదలై.. హాలియా మీదుగా అమరావతి అవుటర్ రింగ్ రోడ్ వరకు 199.16 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్‌తో ఉంటుంది. ఓఆర్ఆర్‌లో పెదకూరపాడు మండలం జలాల్‌పురం వద్ద కలుస్తుంది. అక్కడి నుంచి ఓఆర్ఆర్‌లో 58.84 కి.మీ. వెళ్లి.. తెనాలికి సమీపంలో కంచెర్లపాలెం వద్ద కట్ అవుతుంది. అక్కడి నుంచి

తరువాయి 2లో..

# 13 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం...

### మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**



పిల్లలను సోషల్ మీడియా దుష్ప్రభావాల నుంచి కాపాడేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 13 ఏళ్లలోపు చిన్నారులను సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉంచేందుకు వీలుగా ఒక ముసాయిదా చట్టాన్ని సిద్ధం చేయాలని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలో మంత్రుల బృందం, ఉన్నతాధికారులు, మెటా, యూట్యూబ్ వంటి ప్రముఖ సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, పిల్లల్లో సృజనాత్మకత దెబ్బతినకుండా వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. 13 నుంచి 16 ఏళ్లలోపు పిల్లలకు వారి వయసుకు తగిన కంటెంట్‌ను మాత్రమే అందుబాటులో ఉంచేలా విధివిధానాలు రూపొందించాలని సూచించారు. సోషల్ మీడియా వేదికగా మహిళల పట్ల అవమానకరమైన, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసే

తరువాయి 2లో..

## రిటైర్డ్ ఉద్యోగులకు

# ఏపీ సర్కార్ తీపికబురు..




### ఒక్కరోజే రూ.2,950 కోట్లు విడుదల

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు భారీ ఊరట కల్పించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారి బకాయిలను విడుదల చేసే ప్రక్రియను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నిన్న ఒక్కరోజే ఏకంగా రూ. 2,950 కోట్లను విడుదల చేసింది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ, సరెండర్ లీవ్ బిల్లుల కోసం ఈ నిధులను కేటాయించగా, వాటిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు

తరువాయి 2లో..

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!



**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్

తరువాయి 2లో..



## ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్..

# రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు తీసుకున్నారు. ఈరోజు ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ పరిణామంతో ఆయన ఇక జాతీయ రాజకీయాలకే పరిమితం కానున్నట్లు స్పష్టమైంది. త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు నితీశ్ స్వయంగా వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకారంతో నితీశ్ కుమార్ తన ఖాతాలో ఓ అరుదైన ఘనతను చేర్చుకున్నారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ.. ఇలా నాలుగు చట్టసభల్లోనూ

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### చంద్రబాబు 'స్ట్రెయిట్ టాక్'

### మునుపెన్నడూ లేని విధంగా అటాక్

విపక్షం వైసీపీని టార్గెట్ చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శల దాడి పెంచారు. ఇంతకు ముందు ఎన్నడూ లేనట్లు రాజకీయ ప్రత్యర్థులపై చంద్రబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతుండటం చర్చనీయాంశం అవుతోంది. సుదీర్ఘ ప్రసంగాలతో ఒకప్పుడు అన్నింటికి తానే కారణం అన్నట్లు చంద్రబాబు మాట్లాడేవారని అంటున్నారు. అయితే ఇప్పుడు ఆయన ప్రసంగాల్లో స్టైల్ మారినట్లు కనిపిస్తోందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. పంచ్ డైలాగులు, సెటైర్లతో ప్రత్యర్థులను టార్గెట్ చేస్తున్న చంద్రబాబు కొత్త చర్చలకు కేంద్రంగా మారుతున్నారని అంటున్నారు. బాపట్ల జిల్లాలో తాజాగా పర్యటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో వైసీపీ అధినేత జగన్, ఆయన పార్టీ శ్రేణులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "అమరావతి పేరు పలకడం కూడా ఇష్టం లేని వారికి పాలించే అర్హత ఎక్కడిది? అంటూ మాజీ సీఎం జగన్ ను సూటిగా ప్రశ్నించారు. అంతేకాకుండా "జగన్ లాంటి వెయ్యి మంది వచ్చినా అమరావతి నిర్మాణం ఆగదు." అంటూ తేల్చిచెప్పారు. మొన్నటి వరకూ మూడు రాజధానులు అన్నారు. ఇప్పుడు మావిగన్ అంటున్నారు." అంటున్నారని మండిపడ్డారు. "2019కి ముందు బాబాయిని చంపి ఆ నేరాన్ని నాపై వేశారు. నా చేతిలో కత్తి పెట్టి సాక్షి పత్రికలో తప్పుడు కథనం రాశారు. అమరావతిపై కక్ష గట్టి రైతుల త్యాగాలకు విలువ లేకుండా చేశారు. అమరావతి నిర్మాణానికి రూ.2 లక్షలు ఖర్చు అని అసత్య ప్రచారం చేస్తున్నారు. అమరావతి పేరు చెప్పడానికి కూడా ఇష్టపడని వ్యక్తికి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదు." అంటూ చంద్రబాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహిళా రైతులను ఇబ్బందులు పెట్టారు. మహిళలు స్నానాలు చేస్తుంటే డ్రోన్ లతో చిత్రీకరించారు. వారిని జుట్టు పట్టుకుని బయటకు లాగారు. లాఠీలతో కొట్టారు అంటూ గతాన్ని గుర్తు చేశారు. ఇక చంద్రబాబు ప్రసంగాల్లో ఇంతకు ముందు ఎప్పుడూ ఘాటైన పదాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు సైకో అంటూ మండిపడుతూ, విపక్షంతో సై అంటే సై అనే సంకేతాలిస్తున్నారని అంటున్నారు. మహిళల గురించి, నా భార్య గురించి వ్యక్తిగత దూషణలు చేశారు. గత ఐదేళ్లలో మహిళలను వాళ్లకు మహిళల గౌరవం గురించి మాట్లాడే హక్కు ఎక్కడిది? ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అమరావతి మహిళలు వీరోచితంగా పోరాడారు. "నాడు ఐదేళ్ల అధికారంలో ఉండి విధ్వంసం సృష్టించారు. అధికారం పోయాక బెదిరిస్తున్నారు. రాజకీయ పార్టీ లేకపోతే జగన్ ఇంట్లో నుంచి బయటకు రాగలరా..? రాష్ట్రాన్ని సర్వనాశనం చేయాలని కుట్ర చేస్తున్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. జగన్ రెడ్డి అప్పుడప్పుడు రాష్ట్రానికి వచ్చి బెదిరించి పారిపోతాడు. ఇలాంటి నేతలు మనకు అవసరమా..? అంటూ చంద్రబాబు ప్రశ్నించారు. 50 మందిని పోగేసుకొచ్చి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడు. ఇలాంటి వ్యక్తులను అరెస్ట్ చేయడం నాకు పెద్ద కష్టం కాదు. కానీ నేను చట్ట ప్రకారమే వెళతాను. ఏ తప్పు చేయని నన్ను నోటీస్ కూడా ఇవ్వకుండా జైల్లో పెట్టాడు. ఇలాంటి నేతలను ప్రోత్సహిస్తే ఎవరికీ రక్షణ ఉండదు. భవిష్యత్ ఉండదు. మనందరి జీవితాలు బాగుండాలంటే ఇలాంటి వ్యక్తులను మర్చిపోవాలి. ఏమారితే రాష్ట్రానికి నష్టం జరుగుతుంది."అని సీఎం చంద్రబాబు అన్నారు.

## అమరావతి పక్క నుంచి వెళ్లాలా?

# ఓఆర్ఆర్ మీదుగానా?

మళ్లీ 45.7 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ హైవేగా వెళ్లి.. మచిలీపట్నం సమీపంలోని గూడూరు వద్ద విజయవాడ-మచిలీపట్నం హైవేలో కలుస్తుంది. ఈ అలైన్‌మెంట్ మొత్తం 303.7 కి.మీ. ఇందులో గ్రీన్‌ఫీల్డ్ రోడ్ 244.86 కి.మీ. (తెలంగాణలో 119.14, ఏపీలో 125.72 కి.మీ.) ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌లో భూసేకరణ ఖర్చు రూ.5,500 కోట్లు, నిర్మాణ వ్యయం రూ.8,570 కోట్లు అవుతుందని అంచనా.

**రెండో ఆప్షన్..**

హైదరాబాద్ రేడియల్ రోడ్ నుంచి మొదలై.. 226.650 కి.మీ. మేర గ్రీన్‌ఫీల్డ్ హైవేగా ప్రయాణించి.. కాజ సమీపంలో చెన్నై-కోల్‌కతా హైవేలో విజయవాడ బైపాస్ కలిసిన పాయింట్ వద్దకు వచ్చి కలుస్తుంది. అక్కడినుంచి అవుటర్ రింగ్‌రోడ్‌లో తెనాలి వరకు నిర్మిస్తున్న స్పర్ రోడ్‌లో 16.6 కి.మీ. వెళ్తుంది. ఆ తర్వాత ఓఆర్ఆర్‌లో 4.24 కి.మీ. వెళ్లి, కంచెర్లపాలెం వద్ద కట్ అవుతుంది. అక్కడి నుంచి 45.7 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ హైవేగా వెళ్లి మచిలీపట్నం సమీపంలో గూడూరు వద్ద విజయవాడ-మచిలీపట్నం హైవేలో కలుస్తుంది. ఈ అలైన్‌మెంట్‌లో ఎక్స్‌ప్రెస్‌వే మొత్తం 293.19 కి.మీ. ఇందులో గ్రీన్‌ఫీల్డ్ 272.35 కి.మీ (తెలంగాణలో 119.14 కి.మీ., ఏపీలో 153.21 కి.మీ.) ఉంటుంది. భూసేకరణ ఖర్చు రూ.6,045 కోట్లు, నిర్మాణ వ్యయం రూ.9,530 కోట్లు అవుతుందని అంచనా వేశారు.

**మూడో ఆప్షన్:** హైదరాబాద్ రేడియల్ రోడ్ నుంచి మొదలై.. హాలియా మీదుగా వచ్చి జలాల్‌పురం వద్ద అమరావతి అవుటర్ రింగ్‌రోడ్‌ను క్రాస్ చేసి, నిడుముక్కల, తాడికొండ, నంబూరు మీదుగా వెళ్లి నందివెలుగు సమీపంలో అవుటర్ రింగ్‌రోడ్‌ను రెండో వైపు కూడా క్రాస్ అవుతుంది. మచిలీపట్నం సమీపంలోని గూడూరు వద్ద విజయవాడ-మచిలీపట్నం హైవేలో కలిసేలా అలైన్‌మెంట్ ఉంది. ఈ అలైన్‌మెంట్ మొత్తం సుమారు 288.33 కి.మీ. కాగా, ఇదంతా గ్రీన్‌ఫీల్డ్ రహదారిగానే ప్రతిపాదిస్తున్నారు. ఇందులో తెలంగాణలో 119.14 కి.మీ., ఏపీలో 161.66 కి.మీ. ఉంటుంది. య ఈ ప్రాజెక్టుకు భూసేకరణ ఖర్చు రూ.6,370 కోట్లు, నిర్మాణ వ్యయం రూ.10,100 కోట్లు అవుతుందని అంచనా వేశారు.

## నేడు ఏపీ క్యాబినెట్ సమావేశంలో

# తీసుకున్న కీలక నిర్ణయాలు

తెలిపింది.

**ఎలక్ట్రానిక్స్, లిథియం బ్యాటరీల తయారీకి ఊతం**

ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక పరికరాల తయారీ రంగంలో రాష్ట్రానికి పెద్దపీట వేస్తూ క్యాబినెట్ పలు నిర్ణయాలు తీసుకుంది. పీజీ టెక్నో ప్లాస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, ఏసీల తయారీ యూనిట్‌ను విస్తరించనుంది. రూ.1,305 కోట్ల పెట్టుబడితో రానున్న ఈ ప్రాజెక్టు ద్వారా 2,910 మందికి ఉపాధి లభించనుంది. మరోవైపు, చిత్తూరు జిల్లా కుప్పంలో ఎలక్ట్రిక్ వాహనాలకు అత్యంత కీలకమైన లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి సంబంధించిన ముడి పదార్థాల ప్రాజెక్టును ఎన్‌పీఎస్‌పీఎల్ స్పెషాలిటీ కెమికల్స్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం 105 ఎకరాల భూమి కేటాయిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.2,550 కోట్ల పెట్టుబడి, 4,000 ఉద్యోగాలు రానున్నాయి.

**సెమీకండక్టర్లు, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు**

ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంటున్న సెమీకండక్టర్ల తయారీ రంగంలో ఏపీ కీలక ముందడుగు వేసింది. శ్రీ సత్యసాయి జిల్లాలో ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థ సెమీకండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్ (రూూూ) ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను స్థాపించనుంది. ఇందుకోసం 60 ఎకరాల భూమి కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పెట్టుబడి విలువ రూ.10,239.78 కోట్లు కావడం విశేషం. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్రీన్ హైడ్రోజన్, సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించిన అనేక ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది.

**స్టీల్, భారీ పరిశ్రమలకు ప్రోత్సాహం**

రాష్ట్రంలో ఉక్కు, భారీ పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. విశాఖపట్నంలో ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ తన ఐరన్ ఓర్ పెల్లెట్ ప్లాంట్ సామర్థ్యాన్ని 7 మిలియన్ టన్నుల నుంచి 11 మిలియన్ టన్నులకు విస్తరించనుంది. ఈ రూ.1,400 కోట్ల ప్రాజెక్టు ద్వారా 760 మందికి ఉపాధి లభించనుంది. నెల్లూరు జిల్లాలో శామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ లిమిటెడ్ రూ.3,678 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 3,200 మందికి ఉద్యోగాలు రానున్నాయి.

**దేశంలోనే తొలిసారి.. అమరావతిలో క్వాంటం వ్యాలీ**

భవిష్యత్ సాంకేతికత అయిన క్వాంటం కంప్యూటింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అమరావతిలో 'క్వాంటం వ్యాలీ' ఏర్పాటులో భాగంగా సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (జ-ణూజ) ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ హబ్, హై పర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ సౌకర్యానికి ఆమోదం తెలిపింది. క్వాంటం ఏఐ గ్లోబల్, పీక్యూ స్టేషన్ వంటి సంస్థలు కూడా తమ ప్రాజెక్టులను ఇక్కడ ఏర్పాటు చేయనున్నాయి. దేశంలో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయించినా, ఏ రాష్ట్రం ముందుకు రాని తరుణంలో చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ముందడుగు వేస్తోందని మంత్రి పార్థసారథి తెలిపారు.

**విద్యా, పరిపాలన రంగాల్లో కీలక సంస్కరణలు**

పరిశ్రమలతో పాటు విద్య, పరిపాలన రంగాల్లోనూ క్యాబినెట్ కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు నిబంధనలను సరళతరం చేస్తూ 'ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ యూనివర్సిటీస్ యాక్ట్-2016'కు సవరణలు చేసింది. దీని ప్రకారం యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని 50 ఎకరాల నుంచి పట్టణ ప్రాంతాల్లో 10, ఇతర ప్రాంతాల్లో 15 ఎకరాలకు తగ్గించారు. ఎండోమెంట్ ఫండ్‌ను రూ.15 కోట్ల నుంచి రూ.5 కోట్లకు తగ్గించారు. అలాగే, ఉద్యోగ నియామకాలకు సంబంధించి రాష్ట్రపతి ఉత్తర్వులు-1975 స్థానంలో 'ఏపీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్-2025'ను అమలు చేసేందుకు ఆమోదం తెలిపారు. దీని ప్రకారం రాష్ట్రాన్ని 4 జోన్ల నుంచి 6 జోన్లుగా, 2 మల్టీ జోన్లుగా పునర్వ్యవస్థీకరించారు.

**పర్యాటకం, ఇరిగేషన్, ఇతర కీలక ఆమోదాలు**

రాష్ట్రంలోని చారిత్రక కట్టడాల పరిరక్షణకు పీపీపీ పద్ధతిలో 'అడాప్ట్ ఏ మాన్యుమెంట్' పాలసీకి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు అకాడమీ నిర్మాణ గడువును 2028 జూన్ వరకు పొడిగించింది. విజయవాడలో నిరుపయోగంగా ఉన్న రైతు బజార్ స్థలాన్ని ఆధునిక పుష్పాల మార్కెట్‌గా మార్చేందుకు, పలు ఇరిగేషన్ ప్రాజెక్టుల సవరించిన అంచనాలకు, భారత్ డైనమిక్స్ వంటి సంస్థలకు భూ కేటాయింపుల్లో ఎదురైన సమస్యల పరిష్కారానికి కూడా మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అదే సమయంలో, 2017లో కేటాయించిన భూమిలో పరిశ్రమ పెట్టని వీరవాహన ఉద్యోగ్ ప్రైవేట్ లిమిటెడ్ కేటాయింపులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

## రష్యాలో చిక్కుకుపోయిన 26 మంది భారతీయులు..

# సుప్రీం కోర్టులో పిటిషన్

ఆరోపణలున్నాయి. ఆ తర్వాత పుతిన్ సైన్యంతో కలిసి ఉక్రెయిన్ యుద్ధంలో (ఖుఎఖఅఅ జఙఅంం) పాల్గొనేలా వారిపై ఒత్తిడి తెచ్చారని సమాచారం. 26 మంది ఆచూకీ తెలుసుకోవడానికి దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. మాస్కో నిర్బంధంలో ఉన్న వారి ప్రస్తుత పరిస్థితి ఏంటనే విషయాన్ని తెలియజేయాలని అందులో పేర్కొన్నాయి. ఉక్రెయిన్‌తో రష్యా చేస్తోన్న యుద్ధంలో వీరు పాల్గొనాల్సి వచ్చిందని.. కొందరు గాయపడ్డట్లు, మరికొందరు నిర్బంధంలో ఉన్నట్లు తెలిసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**అలా వ్యాఖ్యలు చేసే కంటే.. మీ వృత్తిపై శ్రద్ధ పెట్టండి: సుప్రీం కోర్టు**

పిటిషనర్ల విజ్ఞప్తిని పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం.. కేంద్రాన్ని వివరణ కోరింది. ఈ పిటిషన్‌ను పరిశీలించి, కేంద్రం నుంచి సూచనలు తీసుకునేందుకు ప్రభుత్వ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలియజేశారు. ఇందుకు అంగీకరించిన న్యాయస్థానం.. ఈ నెల చివరలో దీనిపై విచారణ చేపడతామని తెలిపింది.

## మహిళలకు రూ.3వేలు,

# ఆరు నెలల్లో యూసీసీ అమలు

ప్రజలు ప్రస్తుతం భయంతో జీవిస్తున్నారని.. వారు మార్పు కోరుకుంటున్నారని అమిత్‌షా అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక బెంగాల్‌లోని అన్నివర్గాలను నిరాశ నుంచి బయటపడేస్తామన్నారు. పంట నష్టాల కారణంగా సతమతమవుతున్న రైతులు, నిరుద్యోగ యువత, భయంతో జీవిస్తున్న మహిళలకు కొత్త దారి చూపిస్తామన్నారు. కాగా.. బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు (ఙంంఎఅఎ జుత్రఎఙఖఅఅ) ఏప్రిల్ 23, 29న రెండు విడతలుగా జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉండనుంది.

**మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు..**

గోవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు. బెంగాల్‌లో చొరబాటుదారులపై జీరో టోలరెన్స్. ఆరు నెలల్లో ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అమలు. ఉద్యోగులకు 7వ వేతన సంఘం అమలు. ఐదేళ్లలో కోటి కొత్త ఉద్యోగాలు. స్వయంఉపాధి అవకాశాలు. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3వేలు. మహిళలకు ప్రతినెలా రూ.3వేల ఆర్థిక సాయం. మహిళల కోసం ప్రత్యేక పోలీస్ బెటాలియన్లు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు.

## మొదటి పేజీ తరువాయి

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి

# మోదీకి ఆహ్వానం!

పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

## ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్..

# రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం

సభ్యుడిగా పనిచేసిన కొద్దిమంది నేతల జాబితాలో ఆయన చేరారు. రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ఆయన గురువారమే ఢిల్లీకి చేరుకున్నారు. మార్చి 16న రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన నితీశ్, మార్చి 30న తన శాసనమండలి సభ్యత్వానికి (ఎమ్మెల్సీ) రాజీనామా చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఆయన ముఖ్యమంత్రి పదవి నుంచి కూడా తప్పుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా ఢిల్లీలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. "బీహార్‌లో చాలా పనులు చేశాను. ఇక ఇక్కడే (ఢిల్లీ) ఉండి సేవ చేయాలని భావిస్తున్నాను. మూడు నాలుగు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తాను. కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు చేపడతారు" అని స్పష్టం చేశారు. 2005 నవంబర్‌లో ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నితీశ్ కుమార్ అసెంబ్లీకి పోటీ చేయకుండా, శాసనమండలి సభ్యుడిగానే కొనసాగుతున్నారు. 2006 నుంచి వరుసగా నాలుగుసార్లు ఆయన ఎమ్మెల్సీగా పనిచేశారు. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్, ఆ తర్వాత లోక్‌సభ ఎంపీగా కూడా సేవలందించారు. తాజా పరిణామంతో బీహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలుకానున్నాయి.

## రిటైర్డ్ ఉద్యోగులకు

# ఏపీ సర్కార్ తీపికబురు..

ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఉద్యోగుల పెండింగ్ బకాయిల చెల్లింపులకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ ప్రక్రియకు మార్గం సుగమమైంది. సీఎం ఆదేశాల మేరకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నేతృత్వంలో ఆర్థిక శాఖ, నిధుల లభ్యత ఆధారంగా ఈ చెల్లింపులను పర్యవేక్షిస్తోంది. ప్రభుత్వం మొత్తం మీద రూ.7,059 కోట్లకు పైగా పెండింగ్ బిల్లులను దశలవారీగా చెల్లించాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేవలం ఉద్యోగులే కాకుండా ప్రభుత్వానికి మెటీరియల్ సరఫరా చేసిన చిన్న కాంట్రాక్టర్లకు కూడా ప్రాధాన్యమిస్తూ రూ.614 కోట్ల బిల్లులను ఇప్పటికే చెల్లించింది.

**పెండింగ్ బకాయిలు విడుదల**

తాజా చెల్లింపులకు ముందు కూడా ప్రభుత్వం పలు బకాయిలను క్లియర్ చేసింది. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) బకాయిల కింద రూ.1,848 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసింది. అలాగే, గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కింద 4,793 మందికి రూ.76 కోట్లు, పోలీసు శాఖకు సంబంధించిన అదనపు సరెండర్ లీవుల కోసం రూ.223 కోట్లు విడుదలయ్యాయి. మొత్తం మీద ప్రభుత్వం ఇంకా గ్రాట్యుటీ బకాయిలు రూ.3,411 కోట్లు, విశ్రాంత ఉద్యోగుల లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కింద రూ.1,800 కోట్లు చెల్లించాల్సి ఉంది.

**పోలీసులకు సరెండర్ లీవ్ బిల్లులు**

ప్రస్తుతం సర్వీసులో ఉన్న పోలీసు ఉద్యోగుల సరెండర్ లీవ్ బిల్లుల చెల్లింపు ప్రక్రియ కూడా కొనసాగుతోంది. ప్రభుత్వం వరుసగా బకాయిలు విడుదల చేస్తుండటంతో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ దీర్ఘకాల నిరీక్షణకు తెరపడిందని, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై వారు ధన్యవాదాలు తెలుపుతున్నారు.

## 13 ఏళ్ల లోపు పిల్లలకు

# సోషల్ మీడియా నిషేధం...

వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లల డిజిటల్ భద్రతకు సంబంధించి ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి దేశాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు లోకేశ్ సూచించారు. వయసు నిర్ధారణ కోసం డిజిలాకర్‌తో అనుసంధానించిన 'ఏజ్ టోకెన్' విధానంపై దృష్టి సారించాలని తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కల్పిస్తామన్నారు. పాఠశాలల్లో 'నో బ్యాగ్ డే' రోజున విద్యార్థులకు, పీటీఎం సమావేశాల్లో తల్లిదండ్రులకు దీనిపై అవగాహన కల్పిస్తామని వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సోషల్ మీడియా సంస్థల ప్రతినిధులు.. సున్నితమైన కంటెంట్ను పిల్లలకు దూరంగా ఉంచేందుకు తాము తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యాచరణకు తమ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కొత్తకోట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ ఎస్పీ తుహిన్ సిన్హా

## ప్రజల భద్రతపై కఠిన ఆదేశాలు...గంజాయి, సైబర్ నేరాలపై ఉక్కుపాదం

**అనకాపల్లి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 10**

అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ పనితీరును సమీక్షించడంలో భాగంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, శుక్రవారం కొత్తకోట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం. శ్రావణి కూడా పాల్గొన్నారు. స్టేషన్ పరిసరాలు, కార్యాలయ నిర్వహణ, కేసుల రికార్డులు తదితర అంశాలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేస్తూ, పోలీస్ సిబ్బందికి పలు కీలక మార్గదర్శకాలు జారీ చేశారు. సి.సి.టి.ఎన్.ఎస్ వ్యవస్థలో క్రైమ్ డేటా నమోదు, అప్‌లోడ్ ప్రక్రియను పరిశీలించిన ఎస్పీ, సాంకేతికత వినియోగంలో జాప్యం లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు పోలీసింగ్‌లో కీలకమని ఆయన సూచించారు. కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి. కోటేశ్వరరావు నిర్వహిస్తున్న కార్యాలయ రికార్డుల నిర్వహణపై ఎస్పీ ప్రత్యేకంగా సంతృప్తి వ్యక్తం చేశారు. వేసవి కాలంలో ప్రజలు ఊర్లకు వెళ్లే సందర్భాలు పెరుగుతున్నందున, ఖాళీ ఇళ్లపై దృష్టి పెట్టి రాత్రి గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని ఎస్సై శ్రీనివాస్‌కు సూచించారు. దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు మరియు ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మరియు డీఎస్పీ పోలీస్ సిబ్బందికి పలు సామాజిక అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని



గుర్తుచేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా హెల్మెట్ వినియోగంపై ప్రచారం చేపట్టాలని సూచించారు. పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని, సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే '1930' హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'శక్తి' యాప్ వంటి భద్రతా సదుపాయాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసులు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో నమ్మకం పెంపొందించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ జి. కోటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాస్ మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# ట్రాన్స్‌జెండర్స్ జీవితాల్లో వెలుగునింపిన పోలీస్ కమిషనర్

### – తొలి జీతంతో కృతజ్ఞతల వెల్లువ



**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :010**

సమాజంలో అణగారిన వర్గాలకు చేయూతనిస్తూ వారి జీవితాల్లో మార్పు తీసుకురావడంలో డా. శంఖబ్రత బాగ్చి పాత్ర మరోసారి ప్రశంసలు అందుకుంటోంది. పోలీస్ కమిషనర్ మరియు అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌గా ఆయన అందిస్తున్న ప్రోత్సాహంతో 20 మంది ట్రాన్స్‌జెండర్స్‌కు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వీపర్ ఉద్యోగాలు లభించాయి. ఈ నెలలో జీవితంలో తొలిసారి జీతం అందుకున్న ఆ ట్రాన్స్‌జెండర్స్ అందరూ ఆనందంతో కమిషనర్ ని ఆయన కార్యాలయంలో కలిసి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పూలమాలలు వేసి, శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. వారి ముఖాల్లో కనిపించిన ఆనందం, కొత్త జీవితంపై నమ్మకం ఈ కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చాయి. ఈ సందర్భంగా కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, సమాజంలో ఇంకా వివక్షకు గురవుతున్న, ఆర్థిక ఇబ్బందులతో రోడ్లపై భిక్షాటనకు దిగుతున్న ట్రాన్స్‌జెండర్స్‌కు ఉపాధి అవకాశాలు కల్పించడం అత్యంత అవసరమని అన్నారు. సమాజంలోని వ్యక్తులు, సంస్థలు ముందుకు వచ్చి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. ట్రాన్స్‌జెండర్స్‌కు గౌరవప్రదమైన జీవితం కల్పించేందుకు తీసుకున్న ఈ చర్యకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సమానత్వం వైపు ఇది ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు.

# అల్లూరి జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు



**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :10**

అల్లూరి సీతారామరాజు జిల్లాకు కొత్తగా బదిలీపై వచ్చిన జిల్లా కలెక్టర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో మోదకొండమ్మ తల్లి ఆలయ మరియు ఉత్సవ కమిటీ సభ్యులు కూడా పాల్గొన్నారు. వచ్చే మే 10, 11, 12 తేదీల్లో మోదకొండమ్మ తల్లి జాతర నిర్వహించనున్నట్లు కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు, కొణతాల ప్రశాంత్, బోనగి వెంకటరమణ, సురేష్ కుమార్, కురుష పార్వతమ్మ, లకే సత్యవతి, ఊర్వశి రాణి, మత్స్యరాస కిషోర్ కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఒలింపియాడ్ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

### ఎమ్మెల్యే నల్లారి



**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ఏప్రిల్ 10.సిటి జన్ టైమ్స్**

అన్నమయ్య మదనపల్లి జిల్లా కలికిరి మండలంలో ఇంటర్నేషనల్ టాలెంట్ సర్చ్ ఒలింపియాడ్ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులకు లాప్టాప్ లు, స్మార్ట్ వాచీ లు,గోల్డ్ మెడల్స్ వంటి కన్సోలేషన్ బహుమతులు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పలు రకాల బహుమతులు అందించారు.అన్నమయ్య జిల్లా కలికిరి మండలం నగిరిపల్లి లోని ఎమ్మెల్యే కార్యాలయంలో. జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణిస్తూ క్రీడలు, నైపుణ్యం, క్రమశిక్షణ సమయపాలన పాటించాలని పట్టణం, మరియు గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పట్టుదలతో విద్యను అభ్యసిస్తే జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని ఈ విజయాలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.సమాజంలో మార్పు రావాలంటే చదువుతూనే సాధ్యమని చదువుతోపాటు ఆటల పోటీలు కూడా అవసరమని దాంతోపాటు సమాజ సేవ అలమరుచుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్, ఆర్ ఐ శ్రీధర్, కోఆర్డినేటర్ రవికుమార్ ప్రిన్సిపల్ సుమన్ గౌడ్, ప్రతాపరెడ్డి, డిన్ జానకిరామ్, ప్రైమరీ ఇన్చార్జీలు అనూష సునంద, పీలేరు షీ విద్యాలయ నిర్వహకులు డాక్టర్ పి వి ఎస్ లక్ష్మి డాక్టర్ రాయల్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వాడబలిజల దుర్గాలమ్మ జాతరకు వాసుపల్లి యాభై వేలు విరాళం



**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :10**

దక్షిణ నియోజకవర్గం కొబ్బరి తోట వీధి వాడబలిజి మత్స్యకార కులానికి చెందిన గ్రామ దేవత శ్రీ దుర్గాలమ్మ జాతర మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ యాభై వేలు రూపాయలు లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆశీలమెట్ట కార్యాలయంలో శుక్రవారం కమిటీ సభ్యులకు చెక్ ను అందజేశారు. ప్రతి ఏడాది మాదిరిగా ఉత్సవాలకు సహాయ సహకారాలు అందిస్తున్న వాసుపల్లి గణేష్ కుమార్ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో మళ్లీ తమ నాయకుడిగా అధికారంలోకి వచ్చి సేవలు విస్తృతం చేయాలని అమ్మవారిని ఆరాధిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 14, 15, 16వ తేదీల్లో జరగనున్న జాతర మహోత్సవానికి వాసుపల్లి గణేష్ కుమార్ ని సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వాసుపల్లి మాట్లాడుతూ వాడబలిజి కులానికి చెందిన గ్రామ దేవతగా విరాజిల్లుతున్న శ్రీ దుర్గాలమ్మవారు జాతర విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలపై ఉండాలన్నారు. తమ అధినేత జగన్మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవ చేసే భాగ్యం మళ్లీఅమ్మవారు అందిస్తారని ఆకాంక్షించారు. ఇక్కడి అమ్మవారు ఎంతో ప్రతిష్ట చెందారని, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా తమ వాడ బలిజిల ఆరాధ్య దైవంగా ప్రతి ఏటా తీర్థ మహోత్సవం అంగరంగ వైభవంగా కమిటీ సభ్యులు నిర్వహిస్తారని , అదే మాదిరిగా ఈ ఏడాది కూడా విజయవంతం కావాలని వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దాసరి ఎల్లయ్య, వాసుపల్లి ఎల్లరారావు, వాసుపల్లి దానయ్య, గరికిన కొండబాబు, కెవిఎన్ రాజు, సూరదా రాంబాబు, మెరుగు ఎలాజి స్టేట్ నాయకులు లింగం శ్రీను, లండ రమణ,జిల్లా నాయకులు వాసుపల్లి ధనరాజు, కడవల నాగమణి,వార్డ్ నాయకులు గాలి పార్వతి, సిహెచ్. జ్యోతి, సూరదా లక్ష్మణ్, కమిటీ సభ్యులు వారణాయలు పాల్గొన్నారు.

# గంజాయి అక్రమ రవాణా కేసులో ముగ్గురికి 10 ఏళ్ల జైలు - ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్,ఏప్రియల్ :10**

గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటున్న అనకాపల్లి జిల్లా పోలీసులకు కీలక విజయంగా నిలిచిన ఒక కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వి.మాడుగుల పోలీస్ స్టేషన్ పరిధిలో 2015లో నమోదైన భారీ గంజాయి రవాణా కేసులో ముగ్గురు నిందితులకు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి లక్ష రూపాయల జరిమానా విధిస్తూ చోడవరం 9వ అదనపు జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. 2015 జనవరి 10న వి.మాడుగుల మండలం గరికబంద చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పాడేరు నుంచి వస్తున్న టాటా సుమో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 140 కిలోల గంజాయిని గుర్తించారు. వెంటనే పోలీసులు వాహనంతో పాటు గంజాయి మరియు నిందితులను అదుపులోకి తీసుకుని ఎన్.డి.పి. ఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో (ఎ1) పానుగంటి సుబ్బారావు (కడప జిల్లా), (ఎ2)అల్లు సత్యనారాయణ (విశాఖపట్నం), (ఎ3)అడిగర్ల సత్తిబాబు (రాంబిల్లి మండలం, అనకాపల్లి జిల్లా) నిందితులుగా గుర్తించబడ్డారు. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున బలమైన సాక్ష్యాధారాలను సమర్పించడంతో నేరం నిరూపిత



మైంది. కోర్టు తీర్పు నేపథ్యంలో, కేసును శాస్త్రీయంగా దర్యాప్తు చేసిన పోలీసు అధికారులు, వాదనలు సమర్థంగా వినిపించిన ప్రాసిక్యూషన్ బృందాన్ని అనకాపల్లి జిల్లా ఎస్పీ అభినందించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పోలీసులు రాజీలేని పోరాటం కొనసాగిస్తారని, ఇటువంటి తీర్పులు అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారికి హెచ్చరికగా నిలుస్తాయని పేర్కొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యక్ష సమీక్ష -ఎమ్మెల్యే గంటా

**మధురవాడ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:10**



మధురవాడ జోనల్ కార్యాలయంలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. గతంలో అధికారుల ద్వారా పీజీఆర్ఎస్‌లో పరిష్కరించామని చూపిన ఫిర్యాదులపై ఎమ్మెల్యే స్వయంగా ఫిర్యాదిదారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వీధి దీపాలు పనిచేయకపోవడం, డెబ్రీస్ తొలగించకపోవడం, సుందరయ్య పార్క్‌లో లైట్లు పనిచేయకపోవడం వంటి సమస్యలు పరిష్కరించబడాయా అని ఆయన ప్రశ్నించారు. సంబంధిత ఫిర్యాదిదారులు ఎం. అప్పారావు, ఈటి శేషగిరిరావు, వి.వి. ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సమస్యలు పరిష్కరించబడ్డాయని తెలిపారు. అయితే, దివ్యాంగ పెన్షన్‌కు సంబంధించిన ఫిర్యాదు ఇంకా పరిష్కారం కాలేదని కరిమిరెడ్డి సాయికుమార్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఇక రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలపై పలువురు వినతిపత్రాలు సమర్పించారు. సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, డీసీపీ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, మొల్లి లక్ష్మణరావు, గరే గురునాథ్, లొడగల అప్పారావు, పిల్లా వెంకట్రావు, నాగోతి సత్యనారాయణ, కె. రామానాయుడు, తాట్రాజు అప్పారావు, లొడగల జానకిరామ్, చెట్టుపల్లి గోపీ, కురుమిన లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ పార్క్ హోటల్‌లో సమ్మర్ షోకేస్ ఎగ్జిబిషన్ ప్రారంభం: పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ





**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 10**

దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గ్రీన్ పార్క్ హోటల్‌లో లావిష్ పాప్ అప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ షోకేస్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను సందర్శించి అందుబాటులో ఉన్న ఉత్పత్తులను పరిశీలించారు. మహిళలకు ఆకట్టుకునే జ్యూలరీ, ఫ్యాషన్ వస్త్రాలు, లైఫ్ స్టైల్ ఉత్పత్తులు, విభిన్న డిజైన్లు ఒకే చోట అందుబాటులో ఉంచినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎగ్జిబిషన్ శుక్రవారం మరియు శనివారం కూడా కొనసాగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అల్లూరి సాహిత్య, నరేన్ వర్మతో పాటు కూటమి నేతలు, టీడీపీ సీనియర్ నాయకులు జగదీష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# గాజువాక బార్ అసోసియేషన్ లేడీ రిప్రజెంటేటివ్‌గా అండి బోయిన లక్ష్మి ఏకగ్రీవ ఎన్నిక

**గాజువాక, సిటిజన్ టైమ్స్,ఏప్రియల్:10**



గాజువాక బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో న్యాయవాది అండి బోయిన లక్ష్మి లేడీ రిప్రజెంటేటివ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గాజువాకకు చెందిన న్యాయవాదులు ఆమెను హృదయపూర్వకంగా అభినందించారు. గాజువాక బార్‌లో చేరి గత 14 సంవత్సరాలుగా న్యాయవాదిగా సేవలందిస్తున్న అండి బోయిన లక్ష్మి, పేదలకు న్యాయ సహాయం అందిస్తూ, అవసరమైన వారికి ఉచిత లీగల్ సేవలు కూడా అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. మహిళా న్యాయవాదుల తరఫున సేవ చేసే అవకాశాన్ని ఆమెకు కల్పించడం పట్ల మహిళా న్యాయవాదులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అండి బోయిన లక్ష్మి మాట్లాడుతూ, న్యాయవృత్తిపై గౌరవంతో ఈ రంగంలోకి వచ్చానని, అంచెలంచెలుగా ఎదుగుతూ 14 సంవత్సరాల ప్రయాణం పూర్తి చేసుకున్నానని పేర్కొన్నారు. బార్ అసోసియేషన్‌లో లేడీ రిప్రజెంటేటివ్‌గా అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ, అందరికీ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు పాల్గొని అండి బోయిన లక్ష్మిని అభినందించారు.

# సాంప్రదాయ బోధనతో పాటు ఆధునిక పద్ధతులు అవసరం: లాంగర్

## వొకేషనల్ విద్యకు రాఘవ్ లాంగర్ ప్రశంసలు





**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :10**

పీఎం శ్రీ పాఠశాలల అమలు పురోగతిని సమీక్షించేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ కార్యదర్శి, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన డా. రాఘవ్ లాంగర్ విశాఖపట్నం జిల్లాలోని పీఎం శ్రీ పాఠశాలలను రెండు రోజుల పాటు సందర్శించారు. పర్యటన సందర్భంగా ఆయన పలు పాఠశాలల్లో వొకేషనల్ ఎడ్యుకేషన్ ల్యాబ్‌లు, సైన్స్ ల్యాబ్‌లు, లైబ్రరీలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, క్రీడా గదులు, కిచెన్ గార్డెన్లు వంటి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులకు అనుకూలమైన అభ్యాస వాతావరణాన్ని కల్పించడంలో పాఠశాలలు చూపుతున్న కృషిని ప్రశంసించారు. జాతీయ విద్యా విధానం (ఎన్.ఈ. పి 2020) లక్ష్యాలకు అనుగుణంగా చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు. వొకేషనల్ ఎడ్యుకేషన్ కార్యక్రమాల్లో పాల్గొంటున్న విద్యార్థులతో ఆయన ప్రత్యక్షంగా మమేకమయ్యారు. విద్యార్థులు వివిధ ట్రేడ్లపై వివరాలు అందించి తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ముఖ్యంగా విద్యార్థులు రూపొందించిన ఎలక్ట్రిక్ వాహనం మోడల్‌ను ఆయన ప్రత్యేకంగా ప్రశంసిస్తూ, అనుభవాత్మక మరియు నైపుణ్య ఆధారిత విద్యకు ఇది మంచి ఉదాహరణ అని పేర్కొన్నారు. రెండవ రోజు విశాఖపట్నంలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. రాఘవ్ లాంగర్ గారు తన విద్యారంగ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ, సుమారు 22 సంవత్సరాల క్రితం జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు.సమావేశంలో ఉపాధ్యాయుల నాణ్యత, బాధ్యతాభావం, వృత్తి నిబద్ధతను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. సాంప్రదాయ బోధన విధానాలతో పాటు ఆధునిక పద్ధతులను అనుసరించాలని సూచించారు. ఆడియో–విజువల్ సాధనాల వినియోగం, విద్యార్థుల చేతిరాత మెరుగుదల, ప్లే–వే పద్ధతుల అమలు వంటి అంశాలను తరగతి గది బోధనలో భాగం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు నిరంతర వృత్తి అభివృద్ధి కోసం ఆన్‌లైన్ కోర్సులు, శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రోత్సహించారు. విద్యా ఫలితాల మెరుగుదలలో ఉపాధ్యాయుల సామర్థ్య వృద్ధి కీలకమని పేర్కొన్నారు. మానవ వనరులను సమర్థంగా వినియోగించడం, తల్లిదండ్రులు సమాజ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం అవసరమని సూచించారు.పీఎం శ్రీ పాఠశాలలు భవిష్యత్తులో ఆదర్శ విద్యాసంస్థలుగా అభివృద్ధి చెందగలవని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. రాష్ట్రంలో పీఎం శ్రీ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేస్తున్న రాష్ట్ర పథక సంచాలకులు బి. శ్రీనివాసరావు కి, జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్న జిల్లా కలెక్టర్ ఒ మేజిస్ట్రేట్ అభిషిక్త్ కిషోర్ కి ఆయన అభినందనలు తెలిపారు. అలాగే ఈ పర్యటనను సమర్థవంతంగా నిర్వహించిన ప్రాంతీయ సంయుక్త విద్యా సంచాలకులు బి. విజయ భాస్కర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ మరియు లైజినింగ్ అధికారి డా. జె. చంద్రశేఖర్ రావు, సీమాట్ అధ్యాపకులు ప్రసాదరావు, రమేష్ మరియు ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రోగులకు అండగా వసుధ ఫౌండేషన్ సహాయం...





**మలికిపురం సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 10:**

అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం లోని పలువురు అనారోగ్య బాధితులకు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు మంజూరు చేసిన ఆర్థిక సహాయ సహకారాలను మలికిపురం గ్రామంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ఇంటివద్ద ఆయన చేతుల మీదుగా సహాయము అందజేశారు. టేకు దుర్గా ప్రసాద్ గూడపల్లి గుండె వ్యాధితో, సరెళ్ళ మోహనరావు పొన్నమండ వెన్నుపూస చికిత్సకు, నక్కా రోహిత్ గన్నవరం ఎముకలు వ్యాధికి, కోటిపల్లి చిన్నిబాబు ఆదుర్రు మోకాలి శస్త్రచికిత్సకు, కలిగిత శ్రీనివాస్ మెరకపాలెం కాలు ఆపరేషన్కు వీరందరికీ మొత్తం రూ 70,000లు లను బాధితుల కుటుంబీకులకు అందించారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి బోనం రాజు, ఆవుపాటి సుబ్రహ్మణ్యం, రాపాక చిన్ని, మీర్జా అబ్బాస్ లతో పాటు పలువురు పాల్గొన్నారు. తమకు ఇంతటి ఆసరాగా నిలిచిన వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజుకి బాధిత కుటుంబాల వారు కృతజ్ఞతలు తెలిపారు.

## గంజాయి కేసుల్లో 20 ఏళ్ల జైలు శిక్ష...

## యువత జాగ్రత్త : ఎస్పీ ఎ.ఆర్. దామోదర్

**విజయనగరం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :10**



గంజాయి రవాణా, విక్రయం, వినియోగం వంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని యువతకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ పిలుపు నిచ్చారు. కఠిన చట్టాల కారణంగా గంజాయి కేసుల్లో పట్టుబడితే జీవి తాలు తీవ్రంగా దెబ్బతింటాయని హెచ్చరించారు. ప్రకటనలో ఎస్పీ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం (ఎన్‌డీపీఎస్ యాక్ట్) ప్రకారం గంజాయి అక్రమ రవాణా వంటి నేరాలకు 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. ఇటువంటి కేసుల్లో బెయిల్ పొందడం కూడా కష్టసాధ్యమని తెలిపారు. తాత్కాలిక ఆనందాల కోసం చెడు అలవాట్లకు లోనై, అక్రమ మార్గాల్లోకి వెళ్లి యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.గడిచిన ఆరు నెలల్లో జిల్లాలో 20 గంజాయి కేసులు నమోదు చేసి, 85 మందిని అరెస్ట్ చేసి జైలుకు తరలించామని వెల్లడించారు. సుమారు రూ.12.50 లక్షల విలువైన 300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో సుమారు 35 మంది యువత ఉండటం బాధాకరమని పేర్కొన్నారు. ప్రజలు గంజాయి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించేందుకు 1972, 100 లేదా 112 నంబర్లకు సంప్రదించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి, ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని, గంజాయి వ్యాపారుల ప్రలోభాలకు లోనుకావద్దని ఎస్పీ సూచించారు.

# అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష







**విశాఖ సిటీ, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :10**

ఉత్తర నియోజకవర్గంలో 2025--2026 సంవత్సరానికి సంబంధించిన అసెంబ్లీ బడ్జెట్ అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మరియు బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సమావేశానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ, జోనల్ కమిషనర్ రాము అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలో ఇప్పటికే అమలులో ఉన్న అభివృద్ధి పనులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన ప్రణాళికలపై అధికారులతో, నాయకులతో సమగ్రంగా చర్చించారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని విభాగాల పనితీరుపై సమీక్ష నిర్వహించి, కొత్తగా కేటాయించిన బడ్జెట్ నిధుల వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆరోగ్యం, పారిశుద్ధ్యం, తాగునీటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు.కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో అక్కడి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా కార్యాలయానికి అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నజీర్, జనసేన ఇన్‌చార్జి ఉషా కిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ బాబు, అలాగే కూటమి నాయకులు, వార్డు అధ్యక్షులు, మండల అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వేసవి ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండండి

## మైనర్లకు వాహనాలిస్తే కఠిన చర్యలు తప్పవు

## అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 10**



వేసవి సెలవుల నేపథ్యంలో జిల్లా ప్రజలు సురక్షితమైన ప్రయాణాలు సాగించాలని, ముఖ్యంగా పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ కోరారు. ఈ మేరకు వాహనదారులు మరియు తల్లిదండ్రుల కోసం ప్రత్యేక సూచనలు జారీ చేశారు. వేసవి సెలవుల్లో మైనర్లు (18 ఏళ్ల లోపు వారు) సరదా కోసం ద్విచక్ర వాహనాలు లేదా ఇతర వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరం. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులు మరియు తల్లిదండ్రులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, భారీ జరిమానా మరియు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి వాహనాలు ఇవ్వకుండా కట్టడి చేయాలని ఎస్పీ హెచ్చరించారు. ?రద్దీ సమయాల్లో లేదా ట్రాఫిక్ జామ్ అయినప్పుడు వాహనదారులు సహనం కోల్పోయి రాంగ్ రూట్‌లో వెళ్లడం లేదా అడ్డదిడ్డంగా వాహనాలు నడపడం చేయకూడదు. క్రమశిక్షణతో వరుస క్రమంలో వేచి ఉండి ట్రాఫిక్ క్లియర్ అయ్యే వరకు పోలీసులకు సహకరించాలి. సుదూర ప్రాంతాలకు వెళ్లే ముందు వాహనం యొక్క టైర్లు, బ్రేకులు, ఇంజన్ కండిషన్‌ను తనిఖీ చేసుకోవాలి. ?జాతీయ రహదారులపై ప్రయాణించేటప్పుడు రోడ్డు భద్రతా హెచ్చరికలను ఖచ్చితంగా పాటించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ హైవేలపై వాహనాలను నిలపరాదు. ?ద్విచక్ర వాహనంపై వెళ్లే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ?వేసవి ఎండల దృష్ట్యా తగినంత నీటిని వెంట ఉంచుకోవాలి. సుదీర్ఘ ప్రయాణాలు చేసే వారు పగటి పూట ప్రయాణానికే ప్రాధాన్యత ఇవ్వాలి. ?ప్రయాణంలో ఎటువంటి ఆపద కలిగినా లేదా సమాచారం అందించాలి అంటే 100 /112.హైవే హెల్ప్ లైన్ నెంబర్ 1033 కి సంప్రదించండి అని ఎస్పీ తెలిపారు. ?"రహదారి నిబంధనలు పాటించడం అంటే మన ప్రాణాలను మనం గౌరవించుకోవడమే. వేసవి సెలవుల్లో ప్రతి ప్రయాణం సురక్షితంగా సాగాలని ఆశిస్తున్నాను" అని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పేర్కొన్నారు.

# ప్రతీ హామీ నెరవేర్చుతాం.. అపోహలు వద్దు

## ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



**భీమిలి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్: 10**

గూగుల్ డేటా సెంటర్ కోసం భూములు ఇచ్చిన రైతులు ఎలాంటి అపోహలకు లోనవ్వాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేర్చుతుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఎంవీపీ కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో తర్లువాడ గ్రామ రైతులతో సమావేశమైన ఆయన, రైతుల సమస్యలను శ్రద్ధగా విన్నారు. రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్‌తో సమావేశమై రైతులకు అనుకూల నిర్ణయం తీసుకునేలా చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ కోసం భూములు ఇచ్చిన రైతుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూల దృక్పథంతో ఉన్నారని, పరిహారం విషయంలో కూడా ఉదారంగా వ్యవహరించారని గుర్తుచేశారు. డి-పట్టా భూములకు ఎకరానికి 20 సెంట్ల భూమి, షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక దుకాణం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పించడమే కాకుండా, 520 మంది రైతులకు 3 సెంట్ల చొప్పున ఇంటి స్థలాన్ని ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. సమాచార లోపం కారణంగా కొంతమంది రైతులు ఆందోళనకు గురై పనులను అడ్డుకున్నారని పేర్కొన్నారు.జిరాయితీ భూములకు కూడా డి-పట్టా మాదిరిగానే పరిహారం ఇవ్వడంపై రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను ఆయన సమర్థించారు. ఈ అంశంపై ముఖ్యమంత్రితో చర్చించి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. డేటా సెంటర్ వల్ల పర్యావరణానికి హాని, ఆరోగ్య సమస్యలు వస్తాయనే తప్పుడు ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. కొన్ని వర్గాలు దుష్ప్రచారం చేస్తున్నాయని రైతులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, ప్రారంభం నుంచి ఎమ్మెల్యే అండగా ఉండటంతో ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని పేర్కొన్నారు. రైతుల తరఫున వైసీపీ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు మజ్జి వెంకట్రావు పాల్గొని, డేటా సెంటర్ పనులకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సంగీత్ మాధుర్, ఏసీపీ అప్పలరాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాట్రాజు అప్పారావు, బి.ఆర్.బి. నాయుడు, బాలి అయ్యప్ప, బంకు రాజు, మజ్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బాధితునికి వైసిపి నేత రమణారావు ఆర్థిక సాయం

**అయినవిల్లి సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 10**

మండల కేంద్రమైన అయినవిల్లి పంచాయితీ పెద పేట చెందిన పాము ఆదిత్య కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు.విషయం తెలుసుకున్న అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు,గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచె రమణారావు శుక్రవారం అమలాపురం గుడ్ సీడ్ ఫౌండేషన్ కార్యాలయంలో ఆదిత్య కు ఆర్థిక సాయం అందజేసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సాయం అందించిన రమణారావు కు ఆదిత్య అతని తండ్రి సుబ్బారావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాగాపు ఈశ్వరరావు, సాదే కోటేశ్వరరావు,పాము వెంకటరమణ, కుంచే రాజేశ్వరి, మాగపు సిద్ధార్థ, ఈదరపల్లి మాజీ సర్పంచ్ నక్కా సంపత్ కుమార్, నాయకులు నేలపూడి సుగంధ కుమార్,పందిరి సుబ్బరాజు,పెనుమాల దొరబాబు,గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు ఎం.వినోద్, పరమట రాజేష్, విప్పర్తి రమేష్,ముత్తాబత్తుల గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# 8వ బెటాలియన్‌లో ఏడీజీపీ సంజయ్ కుమార్ జైన్ పర్యవేక్షణ

### అభివృద్ధి పనుల సమీక్ష





**శేరిలింగంపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

కొండాపూర్‌లోని 8వ బెటాలియన్ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సంజయ్ కుమార్ జైన్, ఐపీఎస్ శుక్రవారం సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ ఎం. రామకృష్ణతో కలిసి ఆయన ఈ సమీక్షా కార్యక్రమాన్ని నిర్వహించారు. బెటాలియన్ సిబ్బంది సంక్షేమం, శిక్షణా ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఇటీవల చేపట్టిన పలు ప్రాజెక్టులను ఏడీజీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. పోర్ట్ వాల్: కవాతు మరియు ప్రత్యేక శిక్షణ కోసం నూతనంగా ఏర్పాటు చేసిన పోర్ట్ వాల్‌ను పరిశీలించారు. ఆర్చరీ అకాడమీ: క్రీడా ప్రోత్సాహంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆర్చరీ అకాడమీ సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహం: ఫంక్షన్ హాల్ అవసరాల నిమిత్తం అదనంగా నిర్మిస్తున్న అకామినేషన్ సెంటర్ పనులను పర్యవేక్షించారు. మౌలిక వసతులు: ప్రాంగణంలో కొనసాగుతున్న ఇతర సివిల్ పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ జైన్ మాట్లాడుతూ. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్మాణ రంగంలో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతను పాటించాలని, నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిబ్బందికి మెరుగైన వసతులు, ఫిట్‌నెస్ మరియు శిక్షణా సౌకర్యాలు కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు ఎం. నాగభూషణం, డి. సత్యనారాయణ ఇతర ఉన్నతాధికారులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మానవత్వం చాటిన ఎస్పీ దామోదర్





**విజయనగరం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 10**

విజయనగరం జిల్లా డెంకాడ మండలం మోదవలస జంక్షన్ వద్ద జరిగిన రహదారి ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ తక్షణ సహాయం అందించారు. వివరాల్లోకి వెళ్తే, ఎస్పీ ఏప్రిల్ 10 ఉదయం విశాఖపట్నం నుంచి విజయనగరం వెళ్తూ మోదవలస జంక్షన్ వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై సమీక్ష నిర్వహించారు. ప్రమాదాల కారణాలను తెలుసుకునేందుకు ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బందితో కలిసి ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్నారు. ఈ సమయంలో, విజయనగరం నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న ఒక వ్యక్తి మోటారు సైకిల్‌పై ముందున్న బొలేరో వాహనాన్ని దాటే క్రమంలో ఢీకొని రహదారిపై పడిపోయాడు. ఘటనను గమనించిన ఎస్పీ వెంటనే స్పందించి, అక్కడ ఉన్న పోలీసు సిబ్బందితో కలిసి గాయపడిన వ్యక్తిని రహదారి పక్కకు తరలించి ప్రాథమిక సపర్యలు అందించారు. షాక్‌లో ఉన్న బాధితుడికి ధైర్యం చెప్పారు. అలాగే, ప్రమాదానికి గురైన వాహనాన్ని రహదారి నుంచి తొలగించి, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు. మోదవలస జంక్షన్ వద్ద ప్రమాదాలు తగ్గించేందుకు వాహనాల వేగ నియంత్రణపై చర్యలు తీసుకోవాలని, స్టాపర్లు ఏర్పాటు చేసి వాటిపై రేడియం స్టిక్కర్లు అమర్చాలని డెంకాడ ఎస్ఐ సన్యాసి నాయుడుకు ఆదేశాలు ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి స్వల్ప గాయాలు కావడంతో, పోలీసుల సహాయంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

# మహానాడు 2026 వేదిక ఎంపికపై టీడీపీ విస్తృత కసరత్తు

## పలు ప్రాంతాల్లో పల్లా శ్రీనివాసరావు పర్యటన - తొమ్మిది స్థలాల పరిశీలన





**విజయనగరం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :10**

స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి సందర్భంగా ప్రతి ఏడాది ఘనంగా నిర్వహించే తెలుగుదేశం పార్టీ మహానాడు ఈసారి మరింత వైభవంగా నిర్వహించేందుకు పార్టీ సన్నాహాలు వేగం పుంజుకున్నాయి. మహానాడు--2026 నిర్వహణకు అనువైన వేదిక ఎంపికలో భాగంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కీలక నేతలతో కలిసి పలు ప్రాంతాల్లో విస్తృత పర్యటన చేపట్టారు. ఈ క్రమంలో ఒక్కరోజులోనే మొత్తం తొమ్మిది అనువైన స్థలాలను ఆయన పరిశీలించారు. వాస్తు అనుకూలత, విస్తీర్ణం, రవాణా సౌకర్యాలు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు వంటి కీలక అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ప్రాంతాన్ని సమగ్రంగా పరిశీలించినట్లు తెలిపారు. లక్షలాది మంది కార్యకర్తలు సౌకర్యవంతంగా పాల్గొనే విధంగా అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలనే దిశగా కసరత్తు కొనసాగుతోందన్నారు. నాథవలస విజయనగరం పార్లమెంట్ పరిధి, పైడిభీమవరం ఎచ్చర్ల నియోజకవర్గం, పిసిని రోడ్, పాటివాడిపాలెం రణస్థలం మండలం, సింగవరం డెంకాడ మండలం, నెల్లిమర్ల నియోజకవర్గం తదితర ప్రాంతాల్లో స్థలాలను పరిశీలిస్తూ మౌలిక వసతులు, విస్తరణ అవకాశాలు, రవాణా అనుసంధానం వంటి అంశాలపై అధికారులు, స్థానిక నాయకులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీకి మహానాడు ఆత్మగౌరవ సభ అని పేర్కొన్నారు. పార్టీ ప్రతిష్టకు తగ్గట్టుగా, దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా నిలిచేలా మహానాడు--2026ను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పటిష్టంగా చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో, యువతను ఆకర్షించేలా పార్టీని ముందుకు తీసుకెళ్తున్న మంత్రి నారా లోకేష్ కార్యచరణతో ఈసారి మహానాడు మరింత ఘనంగా, కనీవినీ ఎరుగని రీతిలో నిర్వహించబడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అన్ని అంశాలను సమీక్షించి తగిన వేదికను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. ఈ పర్యటనలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణ, జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య, పిపిపి కిమిడి నాగార్జున, నెల్లిమర్ల ఇంచార్జి కర్రోతు బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

# రవ్వ ప్లాంట్ వద్ద ఆగ్రహ జ్వాలలు

### - నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నా స్పందన కరవు

### - వేదాంత జీఎం మను ఖన్నా దిష్టిబొమ్మ దగ్ధం

### - గ్రామాన్ని అభివృద్ధి చేసి ఉపాధి కల్పించాలని డిమాండ్



**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 10**

మండలం లోని ఎస్. యానం గ్రామంలో ఉన్న వేదాంతం ఆయిల్ కంపెనీ (రవ్వ ప్లాంట్ ) గ్రామ నిరుద్యోగులకు హామీ ఇచ్చిన100 ఉద్యోగాలు తక్షణం ఇవ్వాలని గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలని అమలాపురం ఎర్ర వంతెన వద్దనుండి యానం వరకు రెండు లైన్ల రోడ్డు నిర్మించాలని,గత నాలుగు రోజులుగా రవ్వ ప్లాంట్ దిగ్బంధం చేసి ఆందోళన నిర్వహిస్తున్న ఇప్పటివరకు వేదాంత యాజమాన్యం స్పందించకపోవడంతో శుక్రవారం ఎస్.యానం రవ్వ ప్లాంట్ వద్ద గ్రామ ప్రజలు నిరుద్యోగులు అగ్రహ జ్వాలలు వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న వేదాంత కంపెనీ జీఎం మను ఖన్నా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మను ఖన్నా డౌన్ డౌన్ వేదాంత యాజమాన్య నిరంకుశ వైఖరి నశించాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు .ఎస్ యానం నుండి వేదాంత కంపెనీ గో బ్యాక్ అంటూ డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని గత నాలుగు రోజులుగా రవ్వ ప్లాంట్ ముట్టడించి కార్యకలాపాలు నిలిపివేశారు. కార్మికులను కూడా వెళ్ళనీయకుండా అడ్డుకొని నిరసన ప్రదర్శన నిర్వహించి నిరవధిక ధర్నా చేపట్టారు. రాత్రి వేళ ఆందోళనకారులు రవ్వ ప్లాంట్ వద్ద నిద్రాహారాలు లేకపోయినా వేదాంత యజమాన్యం స్పందించకపోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా ధర్నాకి నాయకత్వం వహించిన నాయకులు మాట్లాడుతూ వేదంతో ఆయిల్ కంపెనీ గత 15 సంవత్సరాలుగా గ్రామస్తులకు ఒక్క ఉద్యోగం కూడా కల్పించకుండా ఇతర రాష్ట్రాల నుండి వందలాది మంది కార్మికులను దిగుమతి చేసుకుంటున్నారని 35 సంవత్సరాలుగా లక్షల కోట్ల రూపాయల సంపద తరలించకపోయారని ఇప్పటికీ దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రామాన్ని స్మశానములా మార్చి గ్రామ ప్రజల ఉపాధిని కొల్లగొట్టారని అన్ని రకాలుగా కాలుష్య భరితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.రవ్వ ప్లాంట్లో గ్రామస్తులకు కేవలం గడ్డి కోయడం,బాత్రూంలు కడగడం, రోడ్లు ఊడవడం లాంటి ఉద్యోగాలు మాత్రమే కల్పించారని, ప్లాంట్ లో 700 మంది పైగా కార్మికుల పనిచేస్తున్నారని మెజారిటీ శాతం ఇతర రాష్ట్రాల నుండి తీసుకొచ్చిన కార్మికులే ఉన్నారని ఆరోపించారు. 15 సంవత్సరాలుగా గ్రామంలో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కోరుతూ అనేక సందర్భాలలో ఆందోళన నిర్వహించిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్,ఆర్డీవో సమక్షంలో గ్రామస్తులతో చర్చలు జరిపి అనేక హామీలు ఇచ్చారని వాటిని అమలు చేయకుండా గ్రామ ప్రజల పట్ల నిరుద్యోగుల పట్ల వేదాంత యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు రవ్వ ప్లాంట్ వలన గ్రామంలో అన్ని రకాలుగా కాలుష్యం పెరిగి పంట భూములు నాశనం చేశారని, గ్రామస్తులకు ఉపాధి లేకుండా కొల్లగొట్టారని ఇక్కడి నుండి వేలకోట్ల రూపాయల సంపద దోచుకుంటూ ఈ ప్రాంతాన్ని ప్రాంత ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు వేదాంత ఆయిల్ కంపెనీ విడుదల చేస్తున్న కాలుష్యం వలన అనేకమంది గ్రామ ప్రజలు భయంకరమైన వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు అమలాపురం ఆర్డీఓ సమక్షంలో వేదాంత ముఖ్యమైన అధికారులు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని, 2026 ఏప్రిల్ నెల వచ్చిన ఆ హామీలు ఇప్పటివరకు అమలు చేయలేదని, దీనికి కారణం ప్లాంట్ లో పనిచేస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన ఉన్నత స్థాయి అధికారులు మను ఖన్నా లాంటివాళ్ళు ఈ ప్రాంతం పట్ల తెలుగువారి పట్ల వివక్ష చూపుతూ నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు వేదాంత అధికారులు ఎస్.యానం గ్రామస్తులకు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని వంద ఉద్యోగాలు వెంటనే కల్పించాలని ఎర్ర వంతెన నుండి ఎస్.యానం వరకు మెయిన్ రోడ్డు ను ఆధునికరించాలని గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి గ్రీన్ ప్లాంట్ అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కాలయాపన చేస్తూ హామీలు అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉదృతం చేసి వేదాంత యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు రవ్వ ప్లాంట్ కార్యకలాపాలు అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో దంగేటి చిట్టిబాబు లంకె భీమరాజు అయితా బత్తుల రాజశేఖర్ పి డి ఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ యానం గ్రామస్తులు రేవు తిరుపతిరావు చిలుకూరి రాంబాబు రాపాక నాగేశ్వరరావు పులిశెట్టి దొరబాబు పలచోళ్ళ పద్మనాభం జోగి రాజు పినిశెట్టి నరసింహారావు పెట్ట అప్పారావు ఉంద్రు సామేలు రేవు రాజేష్ ఉడుము కిషోర్ మన్నె వాసు పలుప్రోలు సుబ్బరాజు పలచోళ్ళ వెంకటేశ్వరరావు బడుగు వినయ్ రేవు మనోహర్ బూల ప్రసాద్ నాతి వెంకటేశ్వరరావు డాక్టర్ బాబ్జి కొల్లు ఏడుకొండలు అయితా బత్తుల అజయ్ రేవు స్వామి,లంకె రాంబాబు, ముత్తా బత్తుల శ్రీను, కోటిపల్లి రాజు, మేకల నానాజీ తదితరులు పాల్గొన్నారు.

# బండారులంకలో అత్యాధునిక మెడ్‌ప్లస్ ఫార్మసీని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ అయితాబత్తుల ఆనందరావు

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 10**

అమలాపురం రూరల్ మండలం బండారులంక గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ' మెడ్‌ప్లస్ మెడికల్ షాపు ను అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా నాణ్యమైన మందులు, అత్యాధునిక వైద్య సేవలు ప్రజలకు చేరువ కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్పొరేట్ స్థాయిలో తక్కువ ధరకే నాణ్యమైన మందులను అందించే మెడ్‌ప్లస్ వంటి సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో శాఖలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. బండారు లంక చుట్టుపక్కల గ్రామ ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. నిర్వాహకులు తిక్కిరెడ్డి ప్రభు మాట్లాడుతూ.. తమ ఫార్మసీలో అన్ని



రకాల అల్లోపతి మందులతో పాటు, ఇతర ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని, వినియోగదారులకు ఆకర్షణీయమైన డిస్కౌంట్లు అందిస్తున్నట్లు తెలిపారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ఎమ్మెల్యే గారికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, నిర్వాహకులు మరియు గ్రామ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా టిడిపి యువ నాయకులు పృథ్వీరాజ్ జన్మదిన వేడుకలు





**ముమ్మిడివరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 10**

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో యువ నాయకుడు పృథ్వీరాజ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముమ్మిడివరం నగర టిడిపి అధ్యక్షులు కట్ట సత్తిబాబు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు దాట్ల పృథ్వీరాజ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముమ్మిడివరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు పాల్గొన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గం నుండి నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చి పుట్టినరోజు కార్యక్రమంలో పాల్గొన్నారు. భారీ కేక్ కట్ చేసి పృథ్వీరాజ్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ముమ్మిడివరం అన్న క్యాంటీన్లో ఉచితంగా పేదలకు భోజన సదుపాయాలు ఏర్పాటు చేసి అక్కడ కూడా భారీకే కట్ చేసి పూలకుచ్చెలతో పృథ్వీరాజ్ కి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు నాయకులు కార్యకర్తలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు,అనంతరం పోలమ్మ చెరువు గట్టున ఉన్న మూగ చెవిటి పిల్లలకు ఫ్రూట్స్ బిస్కెట్లు ఇవ్వడం జరిగింది. ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు బ్రెడ్ ఫ్రూట్స్ ఇవ్వడం జరిగింది. ముమ్మిడివరం కొండలమ్మ చింత ఆవరణలో వార్డు ఇంచార్జ్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపారు . ముమ్మిడివరం టిటిడి కళ్యాణ మండపం దగ్గర కర్ర దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పృథ్వీరాజ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. లంక తల్లమ్మ గుడి, మార్కెట్ సెంటర్, బాలయోగి గుడి సెంటర్, క్రాప చింతలపూడి సెంటర్, బొండాయకుడు తూము సెంటర్, సోమదేవరపాలెం అడబాల సతీష్ ఇంటిదగ్గర ఆరో వార్డు దివి విజయ్ ఇంటిదగ్గర ఈరోజు పృథ్వీరాజ్ పుట్టినరోజు వేడుకలు భారీ జన సమూహంతో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపారు. పృథ్వీరాజ్ గారికి ఉన్నత పదవులు రావాలని ప్రజలు నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి, చెల్లి అశోక్, కాకర్ల రాజేష్, దొమ్మేటి రమణ కుమార్, గొల్లపల్లి గోపి, చిక్కాల అంజిబాబు, యళ్ల ఉదయ్, పిల్లి నాగరాజు, బొక్క రుక్మిణి, కుడిపూడి మల్లేశ్వరి, ప్రసన్న, కాకి మాణిక్యం, నిమ్మకాయల విష్ణు, జాగు సత్తిబాబు, చింతలపూడి బాబురావు, శివ, రెడ్డి శ్రీను, రెడ్డి సుబ్బారావు, ఎస్ఎంఎస్ ప్రసాద్, కటికీదల నాని, పితాని నరసింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# లేఔట్లలో పార్కుల స్థలాలు గల్లంతు...

# వెంటనే చర్యలు తీసుకోండి: కాంగ్రెస్ నేతలు





**పార్వతీపురం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :10**

జిల్లా కేంద్రంగా ఉన్నప్పటికీ పార్వతీపురం పట్టణంలో పార్కుల అభివృద్ధి జరగకపోవడం పట్ల భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక అధికారి పాలనలోనైనా పట్టణంలో పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. శుక్రవారం డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, కార్యాలయ ఇన్‌చార్జ్ కోలా కిరణ్ కుమార్, ఓబీసీ చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, సాలూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ గేదెల రామకృష్ణతో పాటు యువజన నాయకులు పట్టణంలోని పలు పార్కుల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసిపి మరియు కూటమి పాలకులు పార్వతీపురం ప్రజలకు కనీస పార్కుల సౌకర్యం కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజలు విశ్రాంతి కోసం, పిల్లలు ఆడుకునేందుకు పార్కులు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక, ఎస్ఎన్ఎం నగర్ ప్రాంతాల్లో ఉన్న పార్కుల స్థలాలు వినియోగంలోకి రాకపోవడంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు, పశువుల మేతకు కేంద్రాలుగా మారుతున్నాయని విమర్శించారు. కొన్ని చోట్ల మున్సిపల్ వాహనాల పార్కింగ్ కోసం వాటిని ఉపయోగిస్తున్నారని తెలిపారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో ఏర్పడిన పలు లేఔట్లలో పార్కులకు కేటాయించిన స్థలాలు కనుమరుగవుతున్నాయని ఆరోపించారు. లేఔట్ అనుమతుల సమయంలో తప్పనిసరిగా పార్కుల కోసం స్థలం కేటాయించాల్సి ఉన్నప్పటికీ, అధికారుల పర్యవేక్షణ లోపంతో వాటిని ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని పేర్కొన్నారు. తక్షణమే అన్ని లేఔట్లలో పార్కుల స్థలాల లెక్కలు తేల్చి, వాటిని రక్షించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలకు అవసరమైన రన్నింగ్ ట్రాక్‌లు, పిల్లల ఆట స్థలాలు, వృద్ధుల విశ్రాంతి కోసం సౌకర్యాలు కల్పించాలని సూచించారు. జిల్లా కేంద్రంగా ఉన్న పార్వతీపురం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, ప్రస్తుతం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర్ రెడ్డి ఈ విషయంపై దృష్టి సారించాలని కోరారు. పార్కుల అభివృద్ధితో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలో పెరుగుతున్న స్థలాల ధరల నేపథ్యంలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, పార్కుల స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయని ఆరోపిస్తూ, వాటిని రక్షించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.

## వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ మరో ఏడాది(2026-27)పొడిగింపు

**కాకినాడ /అమరావతి సిటిజన్ టైమ్స్,ఏప్రిల్ 10**

రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జిఓం ఎంస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్,వెటరన్ జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా క్యాస్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను ప్రవేశపెట్టడం జరిగింది. దీర్ఘకాలిక వ్యాధులు మరియు అత్యవసర శస్త్రచికిత్సలతో సహా ప్రభుత్వం నిర్ణయించిన వందలాది వైద్య విధానాలు ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. కాలానుగుణంగా ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వరకూ పొడిగించడం జరిగింది. మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్ ను మరో ఏడాది కాలానికి అనగా 2026-27 కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ(ఐఅండ్ పిఆర్)విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడింగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## రహదారి భద్రతపై తక్షణ చర్యలు అవసరం

### కలెక్టర్ విజయ కృష్ణన్



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్:10**

జిల్లాలో రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా రహదారి భద్రతా సమన్వయ కమిటీ సమావేశంలో ఎస్పీ తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్‌తో కలిసి పరిస్థితులను సమీక్షించారు. ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'లో వైద్యం అందేలా హైవే అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలని, వాహనదారుల్లో అవగాహన పెంచేందుకు రవాణా మరియు పోలీస్ శాఖలు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ జాతీయ రహదారులు, ప్రధాన కూడళ్ల వద్ద లైటింగ్, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం, స్పీడ్ బ్రేకర్లపై రేడియం పెయింటింగ్ చేయడం అత్యవసరమన్నారు. ప్రమాద ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ధ్వజమెత్తిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు

### ఏప్రిల్ 20న విజయవాడలో ధర్నాకు పిలుపు.




**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 10**

ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం పేదలపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు విమర్శించారు. నేడు అమలాపురంలో ప్రజాసంఘాలు కార్యాలయం లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకాన్ని అటకెక్కించేందుకు పాలకులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉపాధి హామీ నిధుల వినియోగంపై తీవ్ర చర్చ జరుగుతోంది. వాస్తవానికి ఈ నిధులు కేవలం కూలీలకు పని కల్పించడానికి, గ్రామీణ ఆస్తుల కల్పనకు కేటాయించబడాలి. అయితే:ఉపాధి హామీ నిధులను పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు మరియు సీసీ రోడ్ల నిర్మాణాలకు మళ్లించడం జరిగింది.దీనివల్ల ప్రధానంగా కూలీలకు అందాల్సిన 'వేతన నిధులు' తగ్గిపోయి, మెటీరియల్ కాంపోనెంట్‌కు నిధులు ఎక్కువ ఖర్చవుతున్నాయి. ఫలితంగా సామాన్య వ్యవసాయ కార్మికులకు చెరువుల తవ్వకం, కాలువల పూడికతీత వంటి పనులు దొరకని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యకం చేశారు ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన కొత్త మార్పులు) క్షేత్రస్థాయిలో గందరగోళానికి దారితీశాయి కొత్త నిబంధనల ప్రకారం పనులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఎస్టిమేషన్లు వేయడంలో సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం జరుగుతోంది. దీనివల్ల వేసవి కాలం వచ్చినా ఇప్పటికీ చాలా గ్రామాల్లో పనులు ప్రారంభం కాలేదు ప్రతి ఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే పనులు ముమ్మరంగా సాగాలి. కానీ ఈ ఏడాది కొత్త సాఫ్ట్‌వేర్ అప్‌డేట్స్ మరియు ప్రణాళికల తయారీలో జాప్యం వల్ల పనులు ఇంకా 'మొదటి మెట్టు' దగ్గరే ఆగిపోయాయి దీంతో పనులు దొరక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు తక్షణం అన్ని గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి వ్యక్తికి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. అవినీతి ముసుగులో తీసుకొచ్చిన 'ఫేస్ యాప్' వల్ల సాంకేతిక ఇబ్బందులు తలెత్తి, వేలమంది పేదలు హాజరు పడక వేతనాలు కోల్పోతున్నారు. ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లినా, ముసలివారు, గర్భిణీలు యాప్ సరిగా పనిచేయక ఉసూరుమంటూ ఇంటికి తిరిగి వస్తున్నారు. ఆవేదన వ్యక్తం చేశారు. రెండు పూటల పని వద్దే వద్దు: గతంలో ఉదయం పని ముగించుకుని మధ్యాహ్నం సొంత పనులు చేసుకునే వీలుండేది. కానీ ఇప్పుడు ఉదయం 6 నుండి 11 వరకు, తిరిగి మధ్యాహ్నం 3 నుండి సాయంత్రం 5 వరకు పనిచేయాలనడం పేదల గొంతుపై కత్తి పెట్టడమే. ఇది పొమ్మనకుండా పొగ పెట్టే చర్య అని ఆయన మండిపడ్డారు. కనీస సౌకర్యాల రద్దు: పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీళ్లు, పనిముట్లు, పే-స్లిప్పులు వంటి కనీస సౌకర్యాలను ప్రభుత్వం రద్దు చేసిందని, సమ్మర్ అలవెన్స్ కూడా ఎగ్గొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముట్టడి:**

ఈ దుర్మార్గపు విధానాలకు నిరసనగా ఈ నెల 20వ తేదీ (సోమవారం) ఉదయం 10 గంటలకు విజయవాడ (తాడేపల్లి పాత టోల్గేట్ సమీపంలో) లోని రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ముందు భారీ ధర్నా చేపడుతున్నట్లు వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఈ ధర్నాలో ఉపాధి హామీ కూలీలు, క్షేత్రస్థాయి సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చింతా వీరప్రసాద్, పి శివ, బళ్ళ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అంజయ్య నగర్ డివిజన్ సమస్యలను పరిష్కరించండి

### డిప్యూటీ కమిషనర్ బాలకృష్ణకు ఆంజనేయులు సాగర్ వినతి



**శేరిలింగంపల్లి, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని అంజయ్య నగర్ డివిజన్ పరిధిలో పలు దీర్ఘకాలిక ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ డివిజన్ నాయకుడు ఆంజనేయులు సాగర్ శుక్రవారం డిప్యూటీ కమిషనర్ ఎన్. బాలకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల్లో మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు? ఈ సందర్భంగా ఆంజనేయులు సాగర్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని వివిధ బస్తీల్లో మౌలిక సదుపాయాల కొరత వేధిస్తోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వినతి పత్రంలోని ప్రధానాంశాలు.



**వీధి దీపాల ఏర్పాటు:** అంజయ్య నగర్, సిద్ధిక్ నగర్, రాజీవ్ నగర్, బంజారా నగర్, గుల్షన్ నగర్, పీజేఆర్ నగర్ ప్రాంతాల్లో వీధి దీపాల కొరత తీవ్రంగా ఉందని, రాత్రి వేళల్లో ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే అవసరమైన చోట్ల నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు.స్మశాన వాటిక అభివృద్ధి: అంజయ్య నగర్ స్మశాన వాటిక అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీనివల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.సమస్యలపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కమిషనర్ ఎన్. బాలకృష్ణ, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ?ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్ సురేష్ సాగర్, పి. లక్ష్మయ్య సాగర్, రామకృష్ణ సాగర్, రోహిత్ సాగర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేత



**దొనకొండ, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

మండల కేంద్రంలో స్థానిక విద్యుత్ విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా 11 - 4 - 2026 శనివారం దొనకొండ పట్టణం ఎర్రబాలెం బాధాపురం. పోలేపల్లి రామ్ రెడ్డి పల్లె కందుల వారి పల్లె చిన్న గుడిపాడు పెద్దగుడిపాడు గంగాదేవి పల్లె నరసింహ నాయుడుపాలెం పెద్దన్నపాలెం దొండపాడు ఈ ఊర్లకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లుగా దొనకొండ మండల విద్యుత్ శాఖ ఏఈ షేక్ నాగూర్ షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు కావున విద్యుత్ వినియోగదారులు రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## నేడు కొమరోలు మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత





**కొమరోలు, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

గిద్దలూరు లోని ఒక 132/ 33 సబ్ స్టేషన్ లో ఏర్పడిన సాంకేతిక లోపాలకు మరమ్మతులు చేయుటకు వీలుగా తీసుకున్న చర్యల్లో భాగంగా కొమరోలు మండలంలోని అన్ని సబ్స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఈ నెల 11వ తేదీ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ నున్నట్లుగా గిద్దలూరు విద్యుత్ శాఖ డి ఈ ఈ బి శేషగిరిరావు ప్రకటించారని, కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు ఒక ప్రకటనలు తెలిపారు. కావున రైతులు, గృహ విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

## భైరవకోన శైవ క్షేత్రాన్ని సందర్శించిన సిఐ వినోద్ కుమార్



**సి ఎస్ పురం, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

జిల్లాలో ప్రఖ్యాతిగాంచిన శైవ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రదేశమైన భైరవకోనను సిఐ డి. వినోద్ కుమార్ శుక్రవారం సందర్శించారు. ఆలయ దర్శనం అనంతరం ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సీఐకి అభిషేక పూజలు, కుంకుమార్చన పూజలు నిర్వహించి దేవస్థాన శేష వస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, కార్యనిర్వాహణాధికారి వంశీకృష్ణారెడ్డి సూచనలతో ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వై వి సుబ్బారెడ్డిని కలిసిన ప్రవీణ్ కుమార్ రెడ్డి



**గిద్దలూరు, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

తాడేపల్లి లో వైవి సుబ్బారెడ్డి ని స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి శుక్రవారం కలిశారు . ఈ సందర్భంగా గిద్దలూరు తాజా రాజకీయ పరిణామాల పై చర్చించారు. గిద్దలూరు లో వై సిపి ని బలోపేతం చేసేందుకు అందరిని కలుపుకుపోయి కృషి చేయాలని వై వి పిడతల కు సూచించారు.

# పోషకాహారంతోనే చిన్నారులకు భవిష్యత్తు...



**పుల్లలచెరువ, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

గర్భధారణ సమయంలో తల్లి తీసుకునే పౌష్టికాహారం.. పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరమైన పెరుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని, పోషకాహారంతోనే చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ దేవీ బాయ్ అన్నారు. ఈ నెల 9 నుంచి 23 వరకు జరిగే 'పోషణ పక్వాడ' కార్యక్రమాన్ని శుక్రవారం పుల్లల చెరువు మండలం తెల్లగట్ల గ్రామంలోనీ అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం సూపర్వైజర్ దేవి బాయ్ ప్రారంభించారు. అనంతరం పోషణ పక్వాడ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ గర్భిణుల నుంచి రెండేళ్లలోపు చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యం, విద్యా విషయాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి గర్భిణి, బాలింత, చిన్నారికి సరైన పోషకాహారం అందేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. గ్రామీణ, గిరిజన ప్రాంత ప్రజలకు పోషకాహారం పై చైతన్యం కల్పించేందుకు అంగన్వాడి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు వి నాగలక్ష్మి,సిహెచ్ లక్ష్మమ్మ, జి సుజాత,అంగన్వాడి ఆయాలు,ఆశ వర్కర్లు,తల్లులు పాల్గొన్నారు.

# రోడ్డు పై గేద అడ్డురావడంతో బైక్ ప్రమాదం

## ఒకరికి తీవ్ర గాయాలు



**సి ఎస్ పురం, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

నేషనల్ హైవే సి ఎస్ పురం-దర్శిగుంటపేట రోడ్డులోని కొండబోయినపల్లి సమీపంలో శుక్రవారం ద్విచక్రవాహనం పై వెళ్తుండగా గేద అడ్డురావడంతో అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ నాయబ్ రసూల్ బైక్ పై వెనుక కూర్చొని ప్రయాణిస్తుండగా అదుపుతప్పి రహదారిపై పడిపోయి తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ పైలట్ రామచంద్రారెడ్డి, ఇఎంటి ప్రసాద్ వెంటనే అక్కడికి చేరుకుని గాయపడిన వ్యక్తిని సి ఎస్ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు, మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్ కు తరలించారు.

# 18న సర్వసభ్య సమావేశం

**పీసీపల్లి, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

ఈనెల 18న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ అత్యాల జఘన్య అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జీవీ కృష్ణారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ , జెడ్పీటీసీ, ఎంపీటీసీ లతో అన్ని శాఖల అధికారులు సమగ్రమైన సమాచారంతో తప్పక హాజరు కావాలని తెలిపారు.

# నీటి భద్రత...నీటి సంఘాల బాధ్యత..! -ఎంపీడీవో

**పుల్లల చెరువు, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

ఆంధ్రప్రదేశ్‌లో నీటి వనరుల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ చేపట్టిన 'నీటి భద్రత -- నీటి సంఘాల బాధ్యత' వంద రోజుల కార్యక్రమం గ్రామీణ స్థాయిలో చైతన్యాన్ని నింపుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గదర్శకత్వంలో అమలవుతున్న ఈ కార్యక్రమానికి పుల్లలచెరువు మండలంలో ఇటీవల శ్రీకారం చుట్టడం విశేషం. నీటి వినియోగంపై రైతుల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా చర్యలు చేపడుతున్నారు. ఎంపీడీవో మరియదాస్ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల పరిరక్షణ ఎంత ముఖ్యమో వివరిస్తూ, ప్రతి నీటి చుక్కను విలువైన వనరుగా భావించి వినియోగించాలనే సందేశాన్ని అందించారు. భూగర్భంలో నీటిమట్టం క్రమంగా పడిపోతున్న నేపథ్యంలో, దానిని పెంపొందించేందుకు సమిష్టి కృషి అవసరమని ఆయన అన్నారు. వ్యవసాయ రంగానికి నీరు ప్రాణాధారం. ఈ నేపథ్యంలో సాగు కాలువల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పొలాల వద్ద ఉన్న సాగు కాలువలను శుభ్రపరిచి నీటి ప్రవాహం సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కాలువల్లో మట్టి పేరుకుపోవడం, చెత్త పేరుకుపోవడం వల్ల నీటి వృథా అవుతోందని, దీన్ని నివారించడం ద్వారా నీటి వినియోగ





సామర్థ్యం పెరుగుతుందని వివరించారు. అదేవిధంగా, వర్షపు నీటిని నిల్వ చేసుకునే పద్ధతులపై కూడా రైతులకు మార్గనిర్దేశం చేస్తున్నారు. చెరువులు, కుంటలు పునరుద్ధరణ, రీచార్జ్ గుంతలు తవ్వడం వంటి చర్యలు తీసుకుంటే భూగర్భ జలాల నిల్వలు పెరుగుతాయని తెలిపారు. నీటి సంఘాలు చురుకుగా పనిచేస్తే ఈ కార్యక్రమం విజయవంతమవుతుందని అధికారులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి వినియోగంపై మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని అన్నారు. ప్రభుత్వ పథకాలు, స్థానిక నీటి సంఘాలు, రైతుల సహకారం కలిసి వస్తే నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవడం సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. పుల్లల చెరువు మండలంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు. ఇరిగేషన్ ఈ ఈ , ఇరిగేషన్ ఏఈ, ఏపీఓ మోషే, పిడిఓ, ఇంజనీరింగ్ అసిస్టెంట్, స్వర్ణవ గ్రామం సిబ్బంది, నీటి సంఘం అధ్యక్షుడు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

## ఎంఈఓ జె ప్రసాదరావు



**సి ఎస్ పురం, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ 1 జె ప్రసాదరావు అన్నారు మండలంలోని కె. అగ్రహారం ప్రాథమిక పాఠశాల పరిధిలోని ఎస్టీ కాలనీలో శుక్రవారం ప్రభుత్వ విద్యాశాఖ ఆదేశాల మేరకు ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి జె. ప్రసాదరావు పాల్గొని కాలనీలోని పిల్లలు, తల్లిదండ్రులను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, ఉచిత పుస్తకాలు,యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, అలాగే తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి విద్యార్థికి లభించే 15,000 రూపాయల ఆర్థిక సహాయం వంటి అంశాలను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలు అందిస్తున్న నాణ్యమైన విద్యను అవగాహన చేస్తూ తల్లిదండ్రులను చైతన్యపరిచారు. ఎంఈఓ ప్రసాదరావు స్వయంగా పాఠశాల అడ్మిషన్ దరఖాస్తు ఫారాలను తల్లిదండ్రులకు అందజేశారు ఎంఈఓ జె ప్రసాదరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా వారి భవిష్యత్ కు బలమైన పునాది వేయాలని, డ్రాపౌట్ విద్యార్థులను కూడా తిరిగి పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ విద్య తో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయని అన్నారు ఇప్పటివరకు పాఠశాలలో నమోదు చేయని ప్రతి విద్యార్థిని పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంను ప్రతి ఇంటికి సమాచారం అందించి విద్యార్థులను పాఠశాలకు చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ బాజి, సిఆర్ఎంటి దాసరి శివరామయ్య పాల్గొన్నారు.

# ఎర్రగుంట్ల అటవీ ప్రాంతంలో 200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

**కొమరోలు, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

నాటు సారా తయారు చేయుటకు సిద్ధంగా ఉంచిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశామని గిద్దలూరు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ జయరావు తెలిపారు. కొమరోలు మండలం అల్లినగరం పంచాయతీలోని ఎర్రగుంట్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో రహస్య ప్రాంతంలో నాటు సారా తయారీకి ఏర్పాట్లు జరుగుతున్నట్లుగా పక్కా సమాచారం అందడంతో తాము శుక్రవారం ఆ ప్రాంతానికి వెళ్లి గాలింపు చేపట్టామని ఆయన తెలిపారు. ఆ సందర్భంగా పొదల మధ్య నాటు సారా తయారు చేయుటకు బట్టీలు ఏర్పాటు చేసి ఉన్నట్టుగా గుర్తించామన్నారు. అక్కడే డ్రమ్ములలో, కుండలలో నిలువ ఉంచిన 200 లీటర్ల బెల్లపూటను గుర్తించి నేలపాలు చేశామని ఆయన తెలిపారు .నాటు సార తయారు చేయటం, విక్రయించడం చట్టరీత్యా నేరమని ,అలాంటి వాటికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నాటుసార తయారీ, విక్రయాలకు సంబంధించిన సమాచారం తమకు తెలియజేసి నాటు సారా తయారీ ,విక్రయాన్ని అరికట్టేందుకు సహకరించాలని, సమాచారం అందించిన వారి పేర్లను రహస్యంగా ఉంచుతామని ఎక్సైజ్ ఇన్స్పెక్టర్



జయరావు తెలిపారు .బెల్లపు ఊట ధ్వంసం చేసే కార్యక్రమంలో గిద్దలూరు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ సబ్ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ ,సిబ్బంది పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 20




భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 20, నిందితులను భూతకాల చట్టాలు, ద్వంద్వ నేరారోపణ మరియు స్వీయ నేరారోపణల నుండి రక్షిస్తూ, నిష్పక్షపాతమైన క్రిమినల్ న్యాయాన్ని నిర్ధారిస్తుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 20 నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు చట్టపరమైన రక్షణను మరియు క్రిమినల్ న్యాయంలో నిష్పక్షపాతాన్ని అందిస్తుంది. ఈ ఆర్టికల్ భూతకాల చట్టాలను, స్వీయ-నేరారోపణ నుండి రక్షణను మరియు ద్వంద్వ శిక్షను అనుమతించదు. ఇది కేవలం న్యాయాన్ని నిర్ధారించడంలో మరియు ఏకపక్ష శిక్షలను నివారించడంలో మాత్రమే సహాయపడుతుంది.

**ఆర్టికల్ 20- నేరాలకు శిక్ష పడటం విషయంలో రక్షణ.**

నేరంగా ఆరోపించబడిన చర్య జరిగిన సమయంలో అమలులో ఉన్న చట్టాన్ని ఉల్లంఘించినందుకు తప్ప, మరే ఇతర నేరానికి ఏ వ్యక్తి కూడా దోషిగా నిర్ధారించబడరాదు, అలాగే ఆ నేరం జరిగిన సమయంలో అమలులో ఉన్న చట్టం ప్రకారం విధించదగిన దానికంటే ఎక్కువ శిక్షకు గురిచేయబడరాదు. ఒకే నేరానికి ఏ వ్యక్తిపైనా ఒకసారి కంటే ఎక్కువసార్లు విచారణ జరిపి శిక్షించరాదు. ఏదైనా నేరానికి పాల్పడినట్లు ఆరోపించబడిన ఏ వ్యక్తి కూడా తనకు వ్యతిరేకంగా సాక్షిగా ఉండమని బలవంతం చేయబడడు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 20 అనేది నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను చట్టబద్ధంగా కాపాడే ఒక ముఖ్యమైన ఆర్టికల్. ఇది న్యాయబద్ధతను, నిష్పక్షపాతాన్ని మరియు ఏకపక్షత లేకపోవడాన్ని నిర్ధారిస్తుంది. ఇది పౌరులకు, విదేశీయులకు మరియు చట్టబద్ధమైన సంస్థలకు రక్షణ కల్పిస్తుంది.

**ఆర్టికల్ 20(1): భూతకాల నేర చట్టాల నుండి రక్షణ (ఎక్స్-పోస్ట్ ఫ్యాక్టో చట్టాలు)**

ఆర్టికల్ 20లోని పార్ట్ 1 ప్రకారం, ఒక చర్య జరిగిన సమయంలో అది నేరం కానట్లయితే, ఆ చర్యకు ఏ వ్యక్తిని దోషిగా నిర్ధారించరాదు లేదా కఠినమైన శిక్ష విధించరాదు.

ఇది నేర చట్టాలకు మరియు శిక్షలకు వర్తిస్తుంది, కానీ విచారణకు మరియు నిశ్చయతకు కాదు.

**ఆర్టికల్ 20(2): డబుల్ జెపార్డీ నుండి రక్షణ**

ఆర్టికల్ 20 పార్ట్ 2 ప్రకారం, ఏ వ్యక్తిపైనా ఒకే నేరానికి ఒకటి కంటే ఎక్కువసార్లు విచారణ జరపడం లేదా శిక్షించడం కుదరదు.

శిక్షకు దారితీసే న్యాయపరమైన విచారణల సమయంలో రక్షణ కల్పించడం మరియు అదే నేరానికి సంబంధించి వ్యక్తులను వేధింపుల నుండి కాపాడటం దీని లక్ష్యం.

**ఆర్టికల్ 20(3): స్వీయ-నేరారోపణ నుండి రక్షణ**

ఆర్టికల్ 20(3) ప్రకారం నేరారోపణ ఎదుర్కొంటున్న ఏ వ్యక్తిని కూడా తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పమని బలవంతం చేయకూడదు మరియు మౌనంగా ఉండే హక్కును నిర్ధారిస్తుంది.

ఈ నిబంధన మౌఖిక మరియు డాక్యుమెంటరీ సాక్ష్యాలు రెండింటికీ ఉపయోగించబడుతుంది మరియు శారీరక పరీక్ష లేదా శరీర శోధన మినహా క్రిమినల్ విచారణలకు వర్తిస్తుంది.

జె. కనక దుర్గ లక్ష్మీ
ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్
ఉత్తరాంధ్ర ఇంచార్జి

# కొమరోలులో పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



**కొమరోలు, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు దాహార్తి తీర్చేందుకు కొమరోలు ఎస్సై నాగరాజు శుక్రవారం కొమరోలులోని ఆంజనేయస్వామి ఆలయ కూడలిలో మట్టికుండలతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు ప్రయాణికులు, పాదచారులకు తాగునీరు సౌకర్యం కల్పించి దాహార్తి తీర్చేందుకు వీలుగా మట్టికుండలతో చల్లటి నీటిని అందించేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లుగా ఎస్ఐ నాగరాజు తెలిపారు. రాబోవు రోజులలో అవసరం ఉన్న చోట్ల మరికొన్ని చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. కావున ఆంజనేయస్వామి ఆలయ కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వినియోగించుకుంటూ, సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ నాగరాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఉపాధి పనులను పరిశీలించిన ఎంపీటీసీ గోను సరస్వతి వెంకటేశ్వర రెడ్డి



**సి ఎస్ పురం, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను శుక్రవారం స్థానిక ఎంపీటీసీ గోను సరస్వతి వెంకటేశ్వర రెడ్డి స్వయంగా సందర్శించి పరిశీలించారు. పని ప్రదేశంలో ఉపాధి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామీణ కుటుంబాలకు ఎంతో మేలు చేసే పని. కూలీలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా పనులు సాగాలి. కొంతమందికి హాజరు నమోదు కాకపోవడం గమనించాం. అందుకు ముందుగా ఆధార్ కేంద్రానికి వెళ్లి ఈ-కేవైసీ ప్రక్రియ చేయించాలని, హాజరు సమస్యలు పరిష్కారం అవుతాయని అలాగే కూలీలకు దినసరి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని కోరారు గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేయడంలో ఎలాంటి లోపం ఉండకుండా చూడాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లకు సూచించారు.

# 12న ఉయ్యాలవాడలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

## డా.బ్రహ్మానందరెడ్డి వైద్య బృందం ఆధ్వర్యంలో...

**గిద్దలూరు, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 10**

గిద్దలూరు పట్టణములోని గాయత్రి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని ఉయ్యాలవాడ ప్రాథమిక పాఠశాలలో గ్రామంలో ఏప్రిల్ 12వ తేది ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ శిబిరంలో కీళ్ళనొప్పులు, నడుం నొప్పి, బిపి, షుగర్, నరాల బలహీనత,వెన్నుపూస, థైరాయిడ్ సమస్యలు మొదలైన వ్యాధులకు వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. థైరాయిడ్ పరీక్ష కేవలం 199 రూపాయలకే చేస్తారు.

# యాంగ్రీ స్టార్ ఫ్యామిలీ స్టార్ లా బిజీ అవుతారా?



సారా అర్జున్ యొక్క రాయల్ ఎత్నిక్ లుక్ స్పాట్‌లైట్‌ను దొంగిలించింది

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో యాంగ్రీ స్టార్ రాజశేఖర్ ప్రస్తానం గురించి చెప్పాల్సిన పనిలేదు. దశాబ్దాల పాటు హీరోగా ఎన్నో చిత్రాలతో మెప్పించారు. తెలుగులో తనకంటూ ప్రత్యేకమైన అభిమానుల్ని సంపాదించుకున్నారు. ఇలా కొంత కాలం పాటు ఆయన జమానా నడించింది. హీరోగా అవకాశాలు తగ్గిన క్రమంలో? సొంత బ్యానర్లో కూడా చాలా సినిమాలు నిర్మించారు. వాటిలో కొన్ని విజయాలతో పాటు వైఫల్యాలున్నాయి. ప్రస్తుతం మాత్రం టాలీవుడ్ లో సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. నితిన్ హీరోగా నటించిన -ఎక్స్ ట్రా ఆర్డీనరీ మ్యాన్- తో సెకెండ్ ఇన్నింగ్స్ మొదలు పెట్టినా? ఆ సినిమా వైఫల్యంతో రీచ్ అవ్వలేదు.తాజాగా రిలీజ్ అయిన -బైకర్- విజయం సాధించడంతో రాజశేఖర్ రోల్ ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అయింది.





సొనాల్ చౌహాన్ సొగసైన బ్లాక్ గ్లామ్ లుక్‌లో స్టన్స్

దీంతో అధికారికంగా రాజశేఖర్ సెకెండ్ ఇన్నింగ్స్ షురూ అయింది. నటనలో ఆయన చూపిన పరిణతి, గంభీరమైన ఆహార్యం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.రాజ శేఖర్‌కు ఉన్న ప్రత్యేకమైన వాయిస్ బేస్ , స్క్రీన్ ప్రెజెన్స్ పెద్ద హీరోల సినిమాల్లో పవర్‌ఫుల్ పాత్రలకు సరిగ్గా సరిపోతాయి. ముఖ్యంగా మాస్ సినిమాల్లో తండ్రి పాత్రలు, పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ రోల్స్ లేదా ప్రతినాయక ఛాయలున్న పాత్రల్లో ఆయన కనిపిస్తే ఆ ఇంపాక్ట్ వేరుగా ఉంటుంది.ఒకప్పుడు అగ్ర హీరోగా వెలిగిన నటులు ఇలాంటి మార్పును అంగీకరించడం అంత సులభం కాదు. కానీ రాజశేఖర్ వాస్తవాన్ని గ్రహించి నటుడిగా తన ప్రయాణాన్ని కొనసాగించడానికి సిద్ధపడటం శుభపరిణామం. ఇది కేవలం ఆయనకు మాత్రమే కాకుండా, టాలీవుడ్ పరిశ్రమకు కూడా ఒక మంచి సీనియర్ నటుడు అందుబాటులోకి వచ్చిన ట్లవుతుంది. వైవిధ్యమైన పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను మరింత కలర్‌ఫుల్‌గా మార్చుకునే అవకాశం ఆయన చేతుల్లోనే ఉంది. టాలీవుడ్‌లో హీరోగా ఇమేజ్ తగ్గిన తర్వాత సెకండ్ ఇన్నింగ్స్‌లో తిరుగులేని స్థానాన్ని సంపాదించుకున్న నటుడు జగపతి బాబు. -లెజెండ్- సినిమాతో విలన్‌గా మారి సౌత్ ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, విలన్‌గా బిజీ అయ్యారు.రాజశేఖర్ క్లిక్ అయితే జగపతి బాబుకు పోటీగానూ మారే అవకాశం ఉంది. జగపతి బాబు తరహాలోనే పరిశ్రమలో బలమైన వర్సటైల్ నటుడిగా స్థిరపడతారని విశ్లేషకులు భావిస్తున్నారు. మరి యాంగ్రీ స్టార్ నుండి వర్సటైల్ స్టార్ గా ఆయన ప్రయాణం ఎలా సాగుతుందో చూడాలి. రాజశేఖర్ కూడా ఇంత కాలం పెదవి దాటని మాటని ఈ మధ్యనే దాటించారు. మంచి పాత్రలు పోషించడానికి తానెప్పుడు ముందుటానని వెల్లడించిన నేపథ్యంలో కొత్త అవకాశాలు ఎంత మంది కల్పిస్తారో చూడాలి. ఇప్పటికే రెండు..మూడు ప్రాజెక్ట్ లు ఉన్నట్లు యాంగ్రీస్టార్ రివీల్ చేసిన సంగతి తెలిసిందే.

## చెన్నై సూపర్ కింగ్స్ సరైనా ప్లేయర్స్‌ని తీసుకోలే..

# CSKపై మాజీ క్రికెటర్ ఫైర్



ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్టుగా పేరుగాంచిన చెన్నై సూపర్ కింగ్స్, ప్రస్తుతం గడ్డు పరిస్థితులని ఎదుర్కొంటోంది. 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగున నిలిచిన సీఎస్కే. ప్రస్తుత 2026 సీజన్‌లో కూడా ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. దీంతో జట్టు ఎంపిక, వేలంలో తీసుకున్న నిర్ణయాలపై మాజీ క్రికెటర్ సుబ్రమణ్యం బద్రీనాథ్ చేసిన విమర్శలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి.

### ధరకు తగ్గ ప్రదర్శన ఎక్కడ?:

మినీ వేలంలో ప్రశాంత్ వీర్, కార్తిక్ శర్మ అనే ఇద్దరు ప్లేయర్స్ కోసం చెన్నై సూపర్ కింగ్స్ ఏకంగా ఒక్కొక్కరికి రూ. 14 కోట్లకు పైగా ఖర్చు చేసింది. అయితే, ఇప్పటి వరకు వారు ఆడిన తీరు చూస్తుంటే అంత భారీ ధర పెట్టడం అవసరమా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని బద్రీనాథ్ అన్నారు. ఎవరో ఇచ్చిన సలహాలు విని అంత డబ్బు ధారపోశారు, కానీ క్షేత్రస్థాయిలో వారి ప్రదర్శన మాత్రం నిరాశాజనకంగా ఉందని విమర్శించారు.

### స్కౌటింగ్ వైఫల్యంపై విమర్శలు:

ప్రతిభ గల ఆటగాళ్లను గుర్తించడంలో సీఎస్కే ఇతర జట్ల కంటే వెనుకబడి ఉందని సుబ్రమణ్యం బద్రీనాథ్ తెలిపారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కోసం హేమంగ్ బదానీ, వేణుగోపాల్ రావు లాంటి వారు ప్రపంచవ్యాప్తంగా ఉన్న లీగ్‌లను గమనిస్తూ ఆటగాళ్లను వెలికితీస్తారని కొనియాడారు. ముంబై ఇండియన్స్ జట్టుకు జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా లాంటి దిగ్గజాలు దొరకడానికి కారణం వారి స్కౌట్ జాన్ రైట్.. సీఎస్కేకు అటువంటి పటిష్టమైన స్కౌటింగ్ వ్యవస్థ లేకపోవడం మైనస్ అని వెల్లడించారు.

### శనివారం ఢిల్లీతో కీలక పోరు

వరుస ఓటములతో కుంగిపోయిన చెన్నై సూపర్ కింగ్స్ జట్టు, తమ తదుపరి మ్యాచ్‌లో భాగంగా శనివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి ఫామ్‌లోకి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. అయితే బద్రీనాథ్ చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే, జట్టులో సమూల మార్పులు జరిగితే తప్ప సీఎస్కేకి పూర్వ వైభవం రాదని స్పష్టమవుతోంది.

# నీవు నా కొడుకు కెరీర్ ముగించేశావు: క్రిస్ బ్రాడ్ ఆవేదన.. యువీ రియాక్షన్!

2007 టీ20 ప్రపంచకప్‌లో యువరాజ్ సింగ్ ఒకే ఓవర్లో ఆరు సిక్సర్ల విధ్వంసం క్రికెట్ చరిత్రలో ఒక అద్భుతం. అయితే ఆ ఘటన తర్వాత మైదానం వెలుపల జరిగిన కొన్ని ఆసక్తికరమైన విషయాలను యువీ ఇటీవల 'ది ఓవర్ లాప్' షోలో పంచుకున్నాడు. ఆ సిక్సర్ల వర్షం స్టువర్ట్ బ్రాడ్ కెరీర్‌పై ఎలాంటి ప్రభావం చూపిందో, అతని తండ్రి క్రిస్ బ్రాడ్ ఎలా స్పందించారో యువీ వివరించాడు.ఆ మ్యాచ్‌కు రిఫరీగా ఉన్న స్టువర్ట్ బ్రాడ్ తండ్రి క్రిస్ బ్రాడ్ మ్యాచ్ ముగిశాక యువరాజ్ వద్దకు వచ్చి, "నువ్వు దాదాపు నా కొడుకు కెరీర్‌ను ముగించేశావు" అని అన్నారట. ఒక తండ్రిగా తన కొడుకు పడుతున్న బాధను ఆయన అలా వ్యక్తం చేశారు. దానికి యువీ స్పందిస్తూ.. "సర్, గతంలో నా బౌలింగ్‌లో కూడా ఐదు సిక్సర్లు పడ్డాయి, ఆ బాధ నాకు తెలుసు" అని ఆయనను ఓదార్చే ప్రయత్నం చేశాడు.ఆ తర్వాత క్రిస్ బ్రాడ్ కోరిక మేరకు ఒక జెర్సీపై యువీ సంతకం చేస్తూ.. "నువ్వు భవిష్యత్తులో ప్రపంచంలోనే అత్యుత్తమ బౌలర్‌గా ఎదుగుతావని ఆశిస్తున్నాను" అని రాసిచ్చాడు.

అయితే, ఆ జెర్సీని స్టువర్ట్ బ్రాడ్ కోపంతో డస్ట్‌బిన్‌లో పడేశాడని యువీకి ఇటీవల తెలిసింది. "అంతటి అవమానం జరిగినప్పుడు ఆ కోపం రావడం సహజమే, అది తప్పు కాదు" అని యువీ చాలా పరిణతితో స్పందించాడు. ఆ ఎదురుదెబ్బతో కుంగిపోకుండా బ్రాడ్ 600 పైగా టెస్ట్ వికెట్లు తీసి లెజెండరీ బౌలర్‌గా ఎదగడం గొప్ప విషయమని యువీ కొనియాడాడు.



# పంత్ భాయ్ చెప్పాడు.. నేను కొట్టాను: లక్నో హీరో ముకుల్ చౌదరి



భారత క్రికెట్‌లో ప్రతిభకు కొదవ లేదు. కానీ సరైన అవకాశం, మార్గదర్శకత్వం లభించినప్పుడే యువ ఆటగాళ్లు సంచలనాలు సృష్టిస్తారు. లక్నో సూపర్‌జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) యువ బ్యాటర్ ముకుల్ చౌదరి విషయంలో ఇదే జరిగింది. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో 22 ఏళ్ల ముకుల్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో తన జట్టుకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. 182 పరుగుల లక్ష్య ఛేదనలో లక్నో కష్టాల్లో ఉన్నప్పుడు క్రీజులోకి వచ్చిన ముకుల్, కేకేఆర్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అవేశ్ ఖాన్‌తో కలిసి 54 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఇందులో విశేషమేమిటంటే, అవేశ్ ఖాన్ కేవలం ఒక పరుగు మాత్రమే చేయగా, మిగిలిన 52 పరుగులు ముకుల్ బాదడం విశేషం. చివరి బంతికి బౌండరీ కొట్టి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు.మ్యాచ్ అనంతరం ముకుల్ మాట్లాడుతూ తన ప్రదర్శన వెనుక కెప్టెన్ రిషబ్ పంత్ ఇచ్చిన సలహా ఉందని వెల్లడించాడు. "గతంలో మ్యాచ్‌లను ముగించడానికి చాలా తొందరపడేవాడిని. కానీ ఇప్పుడు ప్రశాంతంగా ఉండటంపై దృష్టి పెట్టాను. ఆటను చివరి వరకు తీసుకెళ్తే గెలిపించగలనని నమ్ముతున్నా" అని తెలిపాడు."గత మ్యాచ్‌లో సరిగా టైమింగ్ చేయలేకపోయాను. దాంతో రిషబ్ భాయ్‌తో మాట్లాడాను. 'నువ్వు అతిగా ఆలోచిస్తున్నావు. నీ పనిపై దృష్టి పెట్టు. బంతిని చూసి ఆడు. నీపై నాకు నమ్మకం ఉంది. నీపై నీకు కూడా నమ్మకం ఉండాలి' అని చెప్పాడు. ఆ మాటలు నాలో ఆత్మవిశ్వాసం నింపాయి" అని ముకుల్ వివరించాడు. పంత్ ఇచ్చిన భరోసాతోనే ఎలాంటి ఒత్తిడి లేకుండా తన సహజమైన ఆట ఆడి జట్టును గెలిపించగలిగానని ముకుల్ పేర్కొన్నాడు.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776